
పెన్ పవర్
తెలంగాణ రౌండప్



సర్వే నెం. 170 మొత్తం స్కెచ్ మ్యాప్‌లో.. 'జిఎల్‌సి' కాంపౌండ్ కూడా..


# రూ.150 కోట్ల ప్రభుత్వ భూమిలో..!
# అక్రమ విల్లాలు..?

## మల్లంపేట్ 'జిఎల్‌సి'లో ఆక్రమిత సర్వే నెం.170 ప్రభుత్వ భూమి ఎక్కడ..?


మల్లంపేట్ 'జిఎల్‌సి'లో నిరాటంకంగా సాగుతున్న అక్రమ నిర్మాణ పనులు..

- మల్లంపేట్ సర్వే నెంబర్. 170/3, 170/4, 170/5 పేరిట ఆక్రమణలో 19.10 ఎకరాలు..
- దాదాపు 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కలుపుకొని ప్రహరీగోడ నిర్మాణం..?
- గుర్ర విజయలక్ష్మి బినామీలకు ప్రభుత్వ భూమి అక్రమ రిజిస్ట్రేషన్‌లపై ఆరోపణలు..



ప్రైవేటు సర్వే స్కెచ్ (PRIVATE SURVEY SKETCH)
(ఎరుపు రంగు రేఖ – ప్రైవేటు సర్వే సరిహద్దు)

మల్లంపేట్ 'జిఎల్‌సి' కాంపౌండ్‌లో ప్రభుత్వ భూమితో కలిపి 19.10 ఎకరాలు..ప్రైవేటు సర్వే మ్యాప్..

- మల్లంపేట్ 'జిఎల్‌సి'లో ఆక్రమిత ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో భూ భకాసురులు పాగా..!
- 8 విల్లాలకి అక్రమంగా అనుమతులు మంజూరు..!మరో 16 విల్లాలు పెండింగ్..
- గత డిప్యూటీ కమిషనర్ హయాలోనే తప్పుడు పర్మిషన్‌ల బాగోతం..?
- 2021లో నలుగురు కమిషనర్‌లు- నలుగురు టిపిఓలపై విచారణ తెలిసిందే..!
- కుక్క తోక వంకరగా..తీరు మారని రెవెన్యూ-సిఎంసి అధికారులు..
- సర్కిల్ కార్యాలయాలే వేదికగా అక్రమ పర్మిషన్‌ల దందా..?
- సిఎంసి విజిలెన్స్ నిఘా వైఫల్యం.. ఏసిబి దృష్టి సారించాలని స్థానికుల విజ్ఞప్తి..

- బిల్డర్ విజయలక్ష్మి కొన్నది 14.20 ఎకరాలు..! ఆక్రమణలో 19.10 ఎకరాలు..!
- 'ప్రైవేటు సర్వే- ప్రభుత్వ సర్వే' మ్యాప్‌లు, నివేదికలు ఒకేవిధంగా ఉన్నప్పటికీ..!
- సర్వేచేసిన రెవెన్యూ అధికారులు సైలెంట్..? వివరాలు గోప్యం..?
- ఈ కబ్జా వ్యవహారంలో ఓ అధికారపార్టీ నాయకుని ప్రమేయం ఉన్నట్లు వినికిడి..
- అవినీతి టౌన్‌ప్లానింగ్ అధికారులను మేనేజ్ చేసి 8 తప్పుడు పర్మిషన్‌లు జారీ..
- ప్రభుత్వ భూమిలో..! ' A1, B1, C1, D1'తో..! లేఅవుట్ ప్లాట్ నెంబర్‌లట..?
- ప్రారంభం నుంచే ఫిర్యాదు చేసినప్పటికీ.. బరితెగించి సహకరించడం గమనార్హం..
- దుండిగల్ సర్కిల్ అధికారుల చేతివాటం.?5 ఎకరాల సర్కార్ భూమికి ఎసరు..?

-4లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# మంత్రి పొంగులేటి తక్షణమే రాజీనామా చేయాలి

- రాత్రికి రాత్రే అనేక కాలనీలను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారని మండిపాటు
- పెద్ద తప్పు చేసి క్షమాపణల చెబితే ప్రజల బాధలు తీరవని వ్యాఖ్య
- కల్యాణలక్ష్మి పథకాన్ని సంతానలక్ష్మి పథకంగా మార్చేశారని మండిపాటు



హైదరాబాద్ పెన్ పవర్:సమస్యలను పరిష్కరించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త చిక్కులు సృష్టిస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరి పిచ్చోడి చేతిలో రాయిలా తయారైందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాత్రికి రాత్రే అనేక కాలనీలను 22ఏ నిషేధిత భూముల జాబితాలో చేర్చడం వల్ల సామాన్య ప్రజలు నరకం చూస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 22ఏ నిషేధిత భూముల జాబితాను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 22ఏ నిషేధిత భూముల వ్యవహారంలో జరిగిన పెద్ద తప్పిదానికి నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మంత్రిని పదవి నుంచి తొలగించకపోతే... ముఖ్యమంత్రి, మంత్రులు కలిసే ఈ భూదందా చేశారనే అనుమానాలు ప్రజల్లో మరింత బలపడతాయని వ్యాఖ్యానించారు. పెద్ద తప్పు చేసి ఇప్పుడు క్షమాపణలు చెబితే ప్రజల బాధలు తీరవని, అసలు ఈ భూములను నిషేధిత జాబితాలో చేర్చమని

-5లో




# కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకూ స్థానిక కోటా

## నిబంధనలు సవరించేదాకా ఉత్తర్వుల అమలు

## తీర్పు వెలువరించిన హైకోర్టు

హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణకు చెందిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగులై... బదిలీలలో భాగంగా ఇతర రాష్ట్రాల్లో పనిచేసిన వారి పిల్లలకూ ఎంబీబీఎస్/బీడీఎస్‌లో స్థానిక కోటా కింద పరిగణించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ఉద్యోగులతోపాటు ఆలిండియా సర్వీసు ఉద్యోగుల పిల్లలకు

-5లో


# రూ.150 కోట్ల ప్రభుత్వ భూమిలో..! అక్రమ విల్లాలు..?



అక్రమ నిర్మాణాలకు.. ఒక సేల్స్ ఆఫీసు కూడా..


ఏడాది క్రితం ఫైల్‌ఫోటో.. ప్రస్తుతం అధికారుల అండతో దర్జాగా పనులు..



చర్యలకు తావులేని అవినీతి అధికారుల నిత్య సమాధానాలు..

ప్రభుత్వ భూమి పరిరక్షణకు ఫిర్యాదు దారులు ప్రైవేటు సర్వే నిర్వహించారు.. రెవెన్యూ అధికారులు ప్రభుత్వ సర్వే చేశారు.. రెండూ ఒకేవిధమైన నివేదికలు వెలువడ్డాయి.. అయినప్పటికీ ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూమిని, రెవెన్యూ అధికారులు స్వాధీన పరుచు కోకుండా, కాలయాపన చేయడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి..? తప్పుడు లేఅవుట్‌లు సృష్టించి, అందులో 'ఎ1, బి1, సి1, డి1' ప్లాట్‌లుగా విభజించిన, ప్రభుత్వ భూమికి, దుండిగల్ సర్కిల్-59 టౌన్‌ప్లానింగ్ అధికారులు అక్రమ అనుమతులు మంజూరు చేస్తుంటే..!రెవెన్యూ అధికారుల మౌనం వహించడం దేనికి సంకేతం..? సిఎంసి అధికారులతో పాటు, రెవెన్యూ యంత్రాంగం కూడా అమ్ముడు పోయిందా..? సుమారు రూ.150 కోట్లు విలువైన ప్రభుత్వ భూమి పట్ల ఎందుకింత అలసత్వం..? సర్వే పూర్తి చేసి ఆక్రమణ గుర్తించిన రెవెన్యూ చర్యల కాలయాపనకు కారణం..? దుండిగల్ రెవెన్యూ, దుండిగల్ సర్కిల్-59 సిఎంసి అధికారుల నిర్లక్ష్యంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.. ఇక దుండిగల్ సర్కిల్-59 సిఎంసి టౌన్‌ప్లానింగ్ విభాగం గురించి తెలిసిందే.. అక్రమ కట్టడాలే లక్ష్యంగా.. కరప్షనే ధ్యేయంగా విధులు నిర్వర్తిస్తున్నారని అనేక నిదర్శనాలు కళ్ళెదుటే ఉన్నాయి.. ఈ 'జిఎల్‌సి' కబ్జాల పర్వంపై 2021 నుండి చర్యలు చేపడుతూనే ఉన్నప్పటికీ.. ఎక్కడి కబ్జాలు అక్కడే అన్నట్టు తయారైంది..

సిఎంసి బ్యూరో, పెన్ పవర్,

మల్లంపేట్ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్లు 170/1, 170/3, 170/4 170/5లో అక్రమ లేఅవుట్లు, అనధికార విల్లాల నిర్మాణాలు, నకిలీ రిజిస్ట్రేషన్‌లు, చట్టవిరుద్ధంగా భవన నిర్మాణ అనుమతుల వ్యవహారంలో, విచిత్ర రీతిలో ప్లాట్ నెంబర్‌లు సృష్టించడం ఒకవంతైతే, వాటికి తప్పుడు నిర్మాణం అనుమతులు మంజూరు చేయడం గమనార్హం.. మల్లంపేట్ 'జిఎల్‌సి' క్రిబ్స్ కాలనీలోని రోడ్ నెంబర్ 10లో ఎటువంటి అప్రూవ్డ్ లేఅవుట్‌గా ఆధారాలు లేనప్పటికీ..! A1, B1, C1, D1 తో ప్లాట్ నెంబర్‌లు సృష్టించి, నిబంధనలకు విరుద్ధంగా ఎనిమిది విల్లాలకి అక్రమంగా అనుమతులు మంజూరు జారీ అయ్యాయి..! మరో 16 విల్లాలకు దరఖాస్తులు "షార్ట్ ఫాల్" కింద పైండింగ్‌లో పెట్టారు.. అందులో 'జిఎల్‌సి' బిల్డర్ గుర్రం విజయలక్ష్మికి చెందిన ఐదు అనుమతులకు దరఖాస్తులు ఉన్నట్టు బయట పడ్డాయని స్థానికులు ఆరోపించారు..

- 3 పేజి తరువాయి

ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే, ఆ ప్రభుత్వాలకు పరిపాలనా సౌలభ్యం, ప్రజల శ్రేయస్సు కోసం, రాష్ట్ర ప్రభుత్వంలో, అధికార యంత్రాంగం కొన్ని కొన్ని సందర్భాలలో అనుకూలంగా వ్యవహరించడం అనాదిగా వస్తున్నదే.. ఇదే అదనుగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు, కొందరు రాజకీయ నాయకులకు వరంగా మారింది.. తమ పదవీ కాంక్షతో పాటు, ప్రజల ఆస్తులు కొల్లగొట్టేందుకు సదవకాశంగా మర్చుకుని.. అధికారపార్టీ ముసుగులో (నాడు బీఆర్ఎస్-నేడు కాంగ్రెస్) కొందరు నాయకులు, అవినీతి అధికారులతో చేతులు కలిపి, ప్రభుత్వ భూములు కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు.. ప్రస్తుతం మల్లంపేట్‌లో సర్వే నెం.170/3, 170/4, 170/5 పేరిట భూ కుంభకోణంలో అధికారులు, నాయకులే దందా సాగిస్తున్నారు.. ఖరీదైన కబ్జాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన మల్లంపేట్ 'జిఎల్‌సి' క్రిబ్స్ వెంచర్‌లో ఉన్న ప్రభుత్వ భూమి కాబ్జా వ్యవహారానికి, ఓ అధికారపార్టీ నాయకుని హుకుం, ఖరీదు రూ.150 కోట్లు విలువైన సర్కార్ భూమికి శఠగోపం పెట్టడం, మల్లంపేట్‌లోనే ఈ విషయం చర్చనీయాంశంగా మారింది..

## నేతలకు దనదాహం..? అధికారులకు అక్రమార్జనే ధ్యేయం..?

దుండిగల్ సర్కిల్ పరిధిలోని మల్లంపేట్ గ్రామ సర్వే నెం.170/3, 170/4, 170/5 'జిఎల్‌సి' లేఅవుట్ అంటేనే అక్రమాల పుట్టగా తేల్చిన అధికారులే..! ఇప్పుడు తప్పుడు అనుమతులు మంజూరు చేయడం వివాదాస్పద విమర్శలకు తావిస్తోంది.. కొన్ని చర్యల ద్వారా అధికారుల్లో మార్పును తెస్తుందని, మారుతారానే అనుకుంటారు.. కానీ దుండిగల్ సర్కిల్-59 సిఎంసిలో గతంలో విజిలెన్స్ విచారణలు..! మొన్నటి ఏసిబి దాడులు జస్ట్ ఫార్మాలిటి కోసమేనని, స్పష్టతను ఇస్తున్నాయి.. గతంలో విధుల్లో ఉన్న డిప్యూటీ కమిషనర్ ఉండగానే, టౌన్‌ప్లానింగ్ వ్యవస్థపై ఏసిబి దాడులు నిర్వహించినా..! ఆయన తీరు మారలేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. ఆ డిప్యూటీ కమిషనర్ ఘనకార్యం, రూ.150 కోట్లు విలువచేసే ప్రభుత్వ భూమికి ఎసరు పెడుతున్నారు.. ఈ కబ్జా వ్యవహారం అటు రెవెన్యూ అధికారులు, ఇటు మున్సిపల్ అధికారుల సమన్వయంతోనే సర్కార్ స్థలంలో నిర్మాణాలు చేపడుతున్నారని, చర్యలు లేని వారి విధుల నిర్వహణే తేటతెల్లం చేస్తుంది..

## కొన్నదెంత..? ఆక్రమణలో ఉన్నదెంత..?

మల్లంపేట్ 'జిఎల్‌సి క్రిబ్స్' వెంచర్‌లో బిల్డర్ విజయలక్ష్మి కొన్న భూమి ఎంత..? ఆ కాంపౌండ్‌లో ఉన్నదెంతో, రెవెన్యూ-మున్సిపల్ అధికారులకు అవగాహన లేకుండా విధులు నిర్వహిస్తున్నారా..? లేకపోతే అమ్ముడు పోయారా..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.. మల్లంపేట్ సర్వే నెంబర్లు 170/3, 170/4, 170/5లో 14.20 భూమికి బదులు, 19.10 ఎకరాలకు కాంపౌండ్ పెట్టడంతో పాటు, బినామీల మీద అక్రమ రిజిస్ట్రేషన్‌ల ఆరోపణలు భూ కబ్జాకు కీలకంగా మారాయి.. ఆ స్థలంలోనే తప్పుడు ప్లాట్ నెంబర్‌లు సృష్టించి, అక్రమంగా కన్‌స్ట్రక్షన్ పర్మిషన్‌లు మంజూరు చేయడం గమనార్హం.. అధికారుల మౌనంతో, పక్కా పథకం ప్రకారమే భూ మాఫియాకు తెరలేపినట్టు తేటతెల్లం చేస్తోంది.. ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా నోటీసులు ఇచ్చామని, చర్యలు తీసుకుంటామని, అవినీతి అధికారులు ఏడాదిపాటు దాటవేసే ధోరణితో చెబుతున్న సమాధానంలోనే కరప్షన్ కనిపిస్తుంది.. కొనుగోలు చేసిన భూమి కంటే.. అదనంగా రిజిస్ట్రేషన్‌లు జరిగాయని, ఫిర్యాదులు వచ్చినప్పటికీ, దున్నపోతు మీద వర్షం పడిన చందంగా వ్యవహరిస్తున్నారు.. దుండిగల్ మండలం, దుండిగల్ సర్కిల్-59 సిఎంసి యంత్రాంగం కబ్జాదారులకు బహిరంగంగానే సహకరించడం వెనుక గెలుపెరుగని ఓ అధికారపార్టీ నాయకుని సిఫార్సులు ఉన్నట్టు వినికిడి..

## బినామీల పేర్లపై రిజిస్ట్రేషన్‌లు..?

మల్లంపేట్ 'జిఎల్‌సి క్రిబ్స్' వెంచర్‌లో ఉన్న ఆక్రమిత ప్రభుత్వ భూమిలో, బిల్డర్ తన ఎన్ఆర్ఐ తెలివితేటలు ప్రదర్శించారని స్థానికుల ఆరోపిస్తున్నారు.. 2021 నుండే తనపై కేసులు నమోదు అవుతున్నాయని భావించిన లక్ష్మీ శ్రీనవాస కన్‌స్ట్రక్షన్ బిల్డర్ విజయలక్ష్మి తన అనుచరులతో పక్కా పతకం పన్నిందట.. మూడు సర్వే నెంబర్ లలో తను కొనుగోలు చేసిన 14.20. ఎకరాల్లో విల్లాలు పూర్తి చేసిన విజయలక్ష్మి.. ఆక్రమిత ప్రభుత్వ భూమిని మాత్రం, తన బినామీల పేరుమీద అక్రమ రిజిస్ట్రేషన్‌లు చేసినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు.. జిఎల్‌సి' ఆక్రమణలో అదనంగా ప్రభుత్వ భూమి ఉన్నట్టు ప్రైవేటు సర్వేలోనూ, రెవెన్యూ సర్వేలోనూ తేల్చారు.. అయినప్పటికీ "రెవెన్యూ మౌనం-మున్సిపల్" అక్రమ అనుమతుల వెనుక భారీగా డబ్బు చేతులు మారాయని, నిరాటంకంగా కొనసాగుతున్న అక్రమ విల్లాల నిర్మాణం ఒక నిదర్శనమని చెప్పవచ్చు..









# 53కులగణనపై మీ చిత్తశుద్ధి ఏది ?

**మంచిర్యాల, ఆగస్టు 18 పెన్ పవర్:** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్376వ జయంతి సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగినది అనంతరం నిర్వహించిన సమావేశంలో ,బీసీ సమాజ్‌రాష్ట్ర కార్యదర్శి నరెడ్ల శ్రీనివాస్ మాట్లాడుతూదేశవ్యాప్తంగా మెజారిటీగా ఉన్న బీసీ వర్గాల ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న కులగణనపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన వైఖరి అవలంబించాలని.కులగణన ద్వారా దేశంలోని వివిధ సామాజిక వర్గాల వాస్తవ జనాభా, వారి సామాజిక--ఆర్థిక పరిస్థితులు వెలుగులోకి వస్తాయని, ఆ గణాంకాల ఆధారంగా విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం, సంక్షేమ పథకాల్లో బీసీలకు న్యాయమైన వాటా కల్పించేందుకు ప్రభుత్వాలు విధానాలు రూపొందించాలని ఆయన డిమాండ్ చేశారు2011లో నిర్వహించిన సామాజిక--ఆర్థిక కుల సర్వే లిలో కుల వివరాల నమోదుకు ఓపెన్ విధానం కారణంగా అనేక ఉపకులాలు, ఇంటిపేర్లు, ప్రాంతీయ పేర్లు వేర్వేరుగా నమోదైన సమస్యలు తలెత్తాయని ఆయన పేర్కొన్నారు. అలాంటి లోపాలు మళ్లీ పునరావృతం కాకుండా 2027 జనగణనలో కులాల నమోదుకు శాస్త్రీయమైన, ప్రామాణికమైన విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అవలంబించాల్సిన అవసరం ఉందన్నారు.ప్రతి కులానికి ప్రత్యేక గుర్తింపు కోడ్ లేదా యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్ కేటాయించి, ఒకే కులానికి ఉన్న వివిధ పేర్లు, మారుపేర్లు, ఉపపేర్లను శాస్త్రీయంగా ఒకే కేటగిరీలోకి తీసుకురావాలని నరెడ్ల శ్రీనివాస్ సూచించారు. అప్పుడు మాత్రమే భవిష్యత్‌లో కోర్టులు, ప్రభుత్వాలు, పరిశోధనా సంస్థలు విశ్వసించగలిగే ప్రామాణిక గణాంకాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు.బీహార్, తెలంగాణ రాష్ట్రాల్లో జరిగిన కుల సర్వేలలో కులాలకు కోడ్ నంబర్లు కేటాయించి సమాచారం సేకరించిన విధానం

దేశానికి ఒక నమూనాగా నిలిచిందని, అలాంటి శాస్త్రీయ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలించాలని ఆయన కోరారు.కులగణనపై కేంద్ర ప్రభుత్వం గతంలో వ్యతిరేక వైఖరి అవలంబించినప్పటికీ, దేశవ్యాప్తంగా బీసీ సంఘాలు, సామాజికవేత్తలు, ప్రజల నుంచి వచ్చిన డిమాండ్ల నేపథ్యంలో కులగణన చేపట్టేందుకు నిర్ణయం తీసుకోవడం స్వాగతించదగ్గ విషయమేనన్నారు. అయితే కులగణన నిర్వహించడం మాత్రమే కాకుండా, అది తప్పులులేని విధంగా, శాస్త్రీయ పద్ధతిలో జరగడం అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## నేతలు నైతిక విలువలు పెంపొందించుకోవాలి

**మండలి ఎథిక్స్ కమిటీ మీటింగ్ తరువాత టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్**

**హైదరాబాద్ పెన్ పవర్:** శాసనమండలి ఎథిక్స్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశం లో చాలా విషయాలు చర్చకు వచ్చాయని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం అయన మీడియాతో మాట్లాడారు.గౌతు లచ్చన్న, ధర్మబిక్షం లాంటి వాళ్ళు ఈ సభల్లో పని చేశారు. ప్రజలు అన్ని గమనిస్తారు.నేతలు నైతిక విలువలతో రాజకీయాలు చేయాలి. కొంత మంది సభ లో, బయట దిగజారి మాట్లాడుతున్నారు.. అన్ని పార్టీల్లో మంచి వాళ్ళు ఉంటారు..చెడ్డ వాళ్ళు ఉంటారు.. నేతలు నైతిక విలువలు పెంపొందించుకోవాలి. నేతలకు ప్రామాణికం నైతిక విలువని అన్నారు.ప్రతిపక్షం ఉండాలి.. అధికార పక్షం కు సలహాలు సూచనలు చేయాలి. ప్రజల దృష్టి లో రాజకీయ నాయకుల విలువ పడిపోతుంది.అది కాపాడుకోవాలి.. ప్రజలు అన్ని గమనిస్తున్నారు జాగ్రత్తగా ఉండాలి. ఎథిక్స్ కమిటీ మొదట రాజ్యసభకు,ఆ తరువాత పక్క రాష్ట్రాలలో నియమాలు చూడడానికి స్టడీ వెళ్లాల్సి ఉంది. రాజగోపాల్ రెడ్డి, చిన్నా రెడ్డి విషయం పార్టీ పరిశీలిస్తుంది. సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీ లో ఉంటుంది.ఒక్కో కులానికి ఒక్కో న్యాయం ఉండదని అన్నారు.

## సర్దార్ సర్వాయు పాపన్న గౌడ్ గొప్ప పోరాటయోధుడు

**సిద్దిపేట: పెన్ పవర్:** సర్దార్ సర్వాయు పాపన్న గౌడ్ గొప్ప పోరాటయోధుడని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అన్నారు.జిల్లా వెనుకబడిన అభివృద్ధి శాఖ వారి ఆధ్వర్యంలో సిద్దిపేట పట్టణంలోని ఎన్సాన్ పల్లి వెళ్ళే మార్గం వద్దగల చౌరస్తా లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై విగ్రహనికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.సబ్బండ వర్గాలకు రాజకీయ సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన కృషి చరిత్రలో నిలిచింది. తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి ఒక ప్రతీక.నాటి కాలంలో అన్ని వర్గాలను రాజ్యాధికారంలో భాగస్వాములను కావాలని ప్రజాస్వామ్యక స్ఫూర్తితో చేసిన పోరాటం గొప్ప విషయం. విశ్వ కీర్తి పొందిన ఆయన గొప్పదనాన్ని స్మరించుకునేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారీ సయ్యద్ రఫీ, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, గౌడ సంఘ నాయకులు, మరియు తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ లో గణేష్ మండపాలన్నింటికీ ఉచిత కరెంట్: కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్






**కరీంనగర్: పెన్ పవర్:** కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో ఏర్పాటు చేయనున్న వినాయక మండపాలన్నింటికీ ఉచితంగా కరెంట్ ను అందించాలని కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ నిర్ణయించినట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చెప్పారు. అందుకు అయ్యే కరెంట్ బిల్లులన్నీ కరీంనగర్ కార్పొరేషన్ చెల్లిస్తుందని ప్రకటించారు. భక్తియుత వాతావరణంలో గణేశ్ ఉత్సవాలను నిర్వహించుకోవాలని కోరారు. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో ఏటా దాదాపు 2 వేల గణేశ్ మండపాలను ఏర్పాటు చేస్తున్నారు. గత మూడేళ్లుగా ఈ మండపాలకు వినియోగిస్తున్న కరెంట్ ఛార్జీలను మొత్తం బండి సంజయ్ కుమార్ తన సొంత డబ్బులు వెచ్చించి చెల్లిస్తున్నారు. ప్రస్తుతం కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని బీజేపీకి అప్పగించిన నేపథ్యంలో గణేశ్ మండపాల కరెంట్ బిల్లులన్నీ కార్పొరేషన్ చెల్లించాలని నిర్ణయం తీసుకోవడం విశేషం.

కరీంనగర్ పర్యటనలో భాగంగా 21వ డివిజన్ విద్యానగర్ లోని శ్రీరాంనగర్ కాలనీలో కోటి రూపాయల మున్సిపల్ సాధారణ నిధులతో సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణ పనులకు కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, స్థానిక కార్పొరేటర్లతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ. తనను గెలిపించిన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధి కోసం అహర్నిశలు పనిచేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు రూ.22 వేల కోట్ల నిధులతో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. అందులో 5 వేల కోట్లతో జాతీయ రహదారులను నిర్మించినట్లు చెప్పారు. ప్రతి గ్రామానికి రూ.5 లక్షల చొప్పు నిధులు ఇచ్చానని, రాబోయే రోజుల్లో పెద్ద మొత్తంలో నిధులిచ్చి గ్రామాలను అభివృద్ధి చేస్తానని చెప్పారు.

మరోవైపు తనను నమ్మి కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ను బీజేపీకి అప్పగించిన ప్రజల రుణం తీర్చుకునేందుకు 100 రోజుల్లోనే రూ.840 కోట్ల యూసీఎఫ్ నిధులను తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే స్మార్ట్ సిటీ పేరుతో రూ.940 కోట్ల నిధులు తెచ్చి కరీంనగర్ ను అభివృద్ధి చేసినట్లు వివరించారు. వరంగల్ కు సైతం స్మార్ట్ సిటీ నిధులొచ్చినప్పటికీ అక్కడ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. తనపై నమ్మకం ఉంచిన కరీంనగర్ ను అభివృద్ధి, ఉత్సవాల నిర్వహణలో తెలుగు రాష్ట్రాల్లోనే అగ్రభాగాన ఉంచేందుకు శాయాశక్తుల క్రుషి చేస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల వరకే రాజకీయాలని, ప్రస్తుతం అభివృద్ధే లక్ష్యంగా రాజకీయాలకు అతీతంగా కార్పొరేటర్లంతా కలిసికట్లుగా ఉంటూ కరీంనగర్ ను అభివృద్ధి చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమం అనంతరం 16వ డివిజన్ లక్ష్మీపూర్, మల్కాపూర్ కాలనీలో 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి రూ.15 లక్షల వ్యయంతో చేపట్టిన వాటర్ పైప్ లైన్ నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు.

## మంత్రి పొంగులేటి తక్షణమే రాజీనామా చేయాలి

-3 పేజి తరువాయి

ఆదేశించింది ఎవరో సమాధానం చెప్పాలని నిలదీశారు. ప్రభుత్వం చేసిన తప్పులను అధికారుల మీదికి నెట్టి తప్పించుకోవాలని చూడటం సరికాదని, వారు ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ కూడా పనిచేయడం లేదని విమర్శించారు.భూములను నిషేధిత జాబితాలో పెట్టింది ప్రభుత్వమే కాబట్టి, ప్రజల నుంచి మళ్లీ దరఖాస్తులు తీసుకోకుండా వెంటనే ఆ జాబితా నుంచి తొలగించాలని హరీశ్ రావు స్పష్టం చేశారు. 2008లోనే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం యూఎల్సీని రద్దు చేయడంతో ఆ స్థలాలు పట్టా భూములుగా మారాయని... అలాగే జీఓల ద్వారా మినహాయింపు పొందిన హెచ్ఎండీఏ, హుడా భూములను కూడా ఇప్పుడు 22A లో చేర్చి రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల ప్రజలను వేధిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో కల్యాణలక్ష్మి పథకం 'సంతానలక్ష్మి'గా మారిపోయిందని, పెళ్లి సమయానికి అందాల్సిన సాయం పిల్లలు పుట్టిన తర్వాత గానీ రావడం లేదని ఎద్దేవా చేశారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తప్పు చేసిన కాంగ్రెస్ నేతలను చట్టపరంగా బాధ్యులను చేస్తామని హెచ్చరిస్తూ, 22A భూముల అంశంపై కేసీఆర్ నాయకత్వంలో అసెంబ్లీ వేదికగా పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు.

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకూ స్థానిక కోటా

-3 పేజి తరువాయి

స్థానిక కోటా కింద వెసులుబాటు కల్పించినపుడు.. కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఉద్యోగుల పిల్లలకు అది కల్పించకపోవడం సమంజసం కాదని పేర్కొంది. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జీవో 150కి సవరణ తీసుకువచ్చేదాకా ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయంది. జీవో 150కి వీలైనంత త్వరగా సవరణ తీసుకువచ్చి రాష్ట్రం వెలుపల పనిచేసే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు స్థానిక కోటా కల్పించేలా చూడాలని ఆదేశించింది. తన తండ్రి ఈఎస్ఐ కార్పొరేషన్‌లో పనిచేస్తూ తిరుపతికి బదిలీ అయి.. తిరిగి హైదరాబాద్‌కు వచ్చినా నిబంధనల ప్రకారం స్థానిక కోటా వర్తింపజేయకపోవడాన్ని సవాలు చేస్తూ కె.సంహిత హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం ఇటీవల విచారణ చేపట్టి ఉత్తర్వులు జారీ చేసింది. అడ్మిషన్ నిబంధనల రూల్ 3(ఎ)(3) నిబంధనను సవరించి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలను కూడా స్థానిక కోటా కిందకు పరిగణించేలా జీవో 150కు సవరణ తీసుకువస్తామని అడ్వొకేట్ జనరల్ హామీ ఇచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ ఉత్తర్వుల రాజ్యాంగబద్ధతపై ఎలాంటి ఉత్తర్వులు అవసరంలేదని పేర్కొంది. అయితే ప్రతిపాదిత సవరణ ఖరారయ్యేవరకు పిటిషనర్ సహా అదే తరహా పరిస్థితుల్లో ఉన్న అభ్యర్థు ఇబ్బందులను గుర్తించి ఈ ఆదేశాలు జారీ చేస్తున్నామని పేర్కొంది. ఆలిండియా సర్వీసు, రాష్ట్రం వెలుపల

పనిచేసే ఉద్యోగుల పిల్లలకు వర్తించే నిబంధనలు, షరతుల ప్రకారమే తెలంగాణ ఆవల పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వ కార్పొరేషన్‌లు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగుల పిల్లలకూ ప్రయోజనం కల్పించాలని ఆదేశించింది. పిటిషనర్‌ను 2026-27 విద్యాసంవత్సరం ఎంబీబీఎస్/బీడీఎస్ అడ్మిషన్‌ల ప్రక్రియలో స్థానిక కోటా కింద పరిగణించి కౌన్సెలింగ్‌కు అనుమతించాలంటూ కాళోజీ యూనివర్సిటీకి ఆదేశాలు జారీ చేసింది.

## నువ్వు లేని లోటు చూడు ఎంత అరాచకమో మరణించాక కూడా ప్రభుత్వం వెంటాడుతుంది

**హైదరాబాద్ పెన్ పవర్:**

నువ్వు లేని లోటు చూడు ఎంత అరాచకమో మరణించాక కూడా ప్రభుత్వం వెంటాడుతుంది పోలీసులు కక్ష కట్టారా అన్నట్లు ఉంది మనిషి లేకపోయినా జ్ఞాపకాల కోసం ఏర్పాటుచేసిన విగ్రహాన్ని కూడా కూల్చివేశారు ప్రభుత్వ స్థలంలో అనుమతి లేకపోయినా ప్రైవేట్ స్థలంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని సోమవారం రాత్రి పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేశారు నువ్వు లేని లోటు చూడు ఎంత అరాచకం సృష్టిస్తున్నారు అంటూ పెద్ది సుదర్శన్ రెడ్డి సతీమణి కన్నీటి పర్యంతరంగా రోదిస్తుంది కూల్చివేసిన విగ్రహం వద్దకు చేరి రోధిస్తున్నస్తున్న తీరును చూసి నర్సంపేట ప్రజలు చలించిపోయారు పెద్దిభార్య రోదనలు అరణ్య రోదనలుగానే మిగిలిపోగా ఈ సంఘటన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పుట్టినరోజు నాడే జరగడం సంచలనం రేపుతుంది ప్రైవేట్ స్థలంలో ఏర్పాటు చేసుకున్న పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని 1500 మంది పోలీసుల బందోబస్తుతో రాత్రికి రాత్రి కూల్చివేసి తెలంగాణ ఉద్యమ నేతను అవమానపచ్చారంటూ బి ఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఆరోపిస్తున్నారు ఈ సంఘటనకు నర్సంపేటలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి పెద్ది మరణించిన రోజు విగ్రహ ఏర్పాటు విషయంలో జరిగిన ఉద్రిక్తతలు మళ్లీ మంగళవారం నాడు కనిపించాయి అయితే పోలీసులు ఎక్కడికి అక్కడ నాకాబంది నిర్వహించారు గొడవలు కాకుండా అరెస్టులు చేశారు మండల స్థాయి జిల్లా స్థాయి నాయకులను హౌస్ అరెస్టు చేశారు గూడూరు మహబూబాబాద్ వరంగల్ తదితర ప్రాంతాల నుండి పెద్ది అభిమానులు రాకుండా అడ్డుకోవడంతో గొడవలు సద్దుమణిగాయి నర్సంపేట లోని మెడికల్ కాలేజ్ ముందు ఏర్పాటు చేసిన దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని అర్థరాత్రి పోలీసులు బందోబస్తు మధ్య తొలగించారని నర్సంపేట బిఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు పరిసరాల్లోకి ఎవరిని రానీయకుండా చేశారని కనీసం పోలీసులకు కూడా సెల్ ఫోన్ లను అనుమతించ లేదంటూ తెలిపారు

## విద్యార్థినుల వేధింపుల విషయంలో లెక్చరర్‌కు ఏబీవీపీ దేహశుద్ధి

**నల్లగొండ పెన్ పవర్:**

దేవరకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థినులను లెక్చరర్ భాస్కర్ గత కొంతకాలంగా లైంగికంగా వేధిస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. ఈ విషయం బయటకు రావడంతో విద్యార్థినులు, వారి తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమైంది.దీంతో విద్యార్థినులను వేధిస్తున్నాడని తెలుసుకున్న ఏబీవీపీ కార్యకర్తలు లెక్చరర్‌ను నిలదీశారు. ఈ క్రమంలో లెక్చరర్‌పై దాడి చేసి, కాలేజీ ఆవరణలో విద్యార్థులు, తల్లిదండ్రులు చూస్తుండగానే అతనిని చితకబాదారు. లెక్చరర్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అనంతరం కాలేజీ ఎదుట ఏబీవీపీ కార్యకర్తలు నిరసన చేపట్టారు. విద్యార్థినుల భద్రతకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కాలేజీ యాజమాన్యం, అధికారులు చర్యలు చేపట్టాలని ఏబీవీపీ కార్యకర్తలు డిమాండ్ చేశారు.

## ప్రెస్ క్లబ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ సదస్సు గవర్నర్కు ఆహ్వానం.

**హైదరాబాద్, ఆగస్టు, 18: పెన్ పవర్:**

హైదరాబాదులో రెండు రోజులు పాటు జరిగే ప్రెస్ క్లబ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ సదస్సు ను తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ప్రారంభిస్తారు. మంగళవారం నాడు లోక భవన్లో గవర్నర్ శివప్రతాప్ శుక్ల గారిని ప్రెస్ క్లబ్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల నేతృత్వంలో ప్రతినిధి బృందం కలిసింది. జాతీయ స్థాయిలో జరిగే ఈ కాంక్లేవ్ ప్రారంభ ఆహ్వాన విందుకు హాజరవుతానని గవర్నర్ తన అంగీకారం తెలిపారు.

జాతీయస్థాయిలో మీడియా పోకడలు ఎదుర్కొంటున్న సవాళ్లు, జర్నలిస్టుల పనితీరుపై గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల సందేశం ఇస్తారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఏ. రాజేష్, జాయింట్ సెక్రటరీలు చిలుకూరి హరిప్రసాద్, వర్ధిల్లి బాపూరావు, కోశాధికారి రమేష్ వైట్ల, కార్యవర్గ సభ్యులు ఎన్ .శ్రీనివాస్ రెడ్డి తదితరులు గవర్నర్ గారిని కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. ఇదే సందర్భంగా గవర్నర్కు హైదరాబాద్ ప్రెస్ క్లబ్ డైరీ ని పాలక మండలి అందజేసింది. గవర్నర్కు పూల మొక్కను అందజేసి సత్కరించారు. ఈనెల 21 తేదీన తాజ్ కృష్ణ హోటల్లో జరిగే ఈ సదస్సు ప్రారంభ ఆహ్వాన విందు కార్యక్రమానికి గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ముఖ్య అతిథిగా విచ్చేస్తారు. దేశం నలుమూలల నుంచి సీనియర్ జర్నలిస్టులు ప్రెస్ క్లబ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రెండు రోజుల సదస్సుకు హాజరవుతారు.

## నగరంలో అత్యాధునిక డెర్మ క్లినిక్

### అత్యాధునిక పద్ధతిలో

**హైదరాబాద్ పెన్ పవర్:** డెర్మటాలజీ చికిత్సలు అందించే ఆసుపత్రి ని నగరంలో అందుబాటులోకి తెస్తున్నట్లు వీకే కొరియన్ డెర్మ వ్యవస్థాపకులు కార్తీక్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ ప్రణయ్ రెడ్డి తో కలిసి వివరాలు వెల్లడించారు. కొరియన్ సాంకేతిక పరిజ్ఞానంతో తమ వద్ద వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. బుదవారం జేఎన్టీయూ మెట్రో స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన ఆసుపత్రిని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. కొరియన్ దేశంలో ప్రత్యేకంగా శిక్షణ పొందిన వైద్యుల బృందం చికిత్సలు అందిస్తారని తెలిపారు.

## హైదరాబాద్‌కు తిరిగి వస్తున్న డిజైన్ డెమోక్రసీ 2026

**హైదరాబాద్ పెన్ పవర్:** భారతదేశంలో ప్రముఖ డిజైన్ ఫెస్టివల్‌గా గుర్తింపు పొందిన డిజైన్ డెమోక్రసీ నాలుగో ఎడిషన్‌కు సిద్ధమైంది బంజారాహిల్స్ లోని రెడిసన్ బ్లూ హోటల్లో వెల్లడించారు. సెప్టెంబర్ 18, 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఈ వేడుక జరగనుంది అన్నారు.200కు పైగా డిజైన్ బ్రాండ్లు, 150 మందికి పైగా ఆర్కిటెక్ట్‌లు, డిజైనర్లు, కళాకారులు, నిపుణులు పాల్గొననున్నారు. 30 వేల మందికి పైగా సందర్శకులు హాజరవుతారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.ఆర్కిటెక్చర్, ఇంటీరియర్స్, ఫర్నిచర్, ఆర్ట్, టెక్స్‌టైల్స్, హస్తకళలకు సంబంధించిన ప్రదర్శనలు, ఇన్‌స్టాలేషన్లు, ప్యానెల్ చర్చలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. డిజైన్ భవిష్యత్తుపై డీడీ టాక్స్, డీడీ ఫోకస్ కార్యక్రమాలతో పాటు 'ది గౌర్మెట్ జోన్'ను కూడా ఏర్పాటు చేస్తున్నారు.

# విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

## గార్లలో ఘనంగా పాపన్న జయంతోత్సవాలు



జయంతి వేడుకలు నిర్వహిస్తున్న గౌడ సంఘం నాయకులు

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 18:** తెలంగాణ గడ్డపై సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాడి బహుజనుల ఆత్మగౌరవాన్ని చాటిన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కల్లుగీత కార్మికుల సంఘం అధ్యక్షులు తోడేటి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బహుజన వీరుడు, పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 జయంతిని పురస్కరించుకొని గార్ల కల్లుగీత కార్మికుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలోని స్థానిక నెహ్రూ సెంటర్ కూడలిలో గల అమరవీరుల స్థూపం వద్ద పాపన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమితులైన తాళ్లపల్లి కృష్ణ గౌడ్ తో పాటుగా మూడుసార్లు వార్డు మెంబర్ గా గెలిచిన తోడేటి శ్రీనివాస్ ప్రజా సమస్యలపై సిపిఎం పార్టీ తరఫున నిరంతరం పోరాడుతున్న కందునూరి శ్రీనివాస్ విదేశీ యానం ముగించుకుని స్వదేశానికి వచ్చిన విజయ రాముడును శాలువాలతో సన్మానించి ఘనంగా సత్కరించారు. అనంతరం గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ సామన్య కుటుంబం నుంచి ఎదిగిన సర్వాయి పాపన్న ప్రజలను ఏకం చేసి అప్పటి ఆధిపత్య వ్యవస్థలకు వ్యతిరేకంగా పోరాడారని గుర్తుచేశారు. ప్రజల హక్కులు, గౌరవం, సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. పాపన్న పోరాటం కేవలం అధికార సాధనకే పరిమితం కాకుండా సామాజిక అసమానతలు, దోపిడీ, ఆధిపత్యానికి వ్యతిరేకంగా సాగిందని పేర్కొన్నారు. అణగారిన వర్గాల నుంచి నాయకత్వ లక్షణాలతో ఎదిగి ప్రజల కోసం పోరాడవచ్చని తన జీవితంతో నిరూపించారని అన్నారు.పాపన్న చూపిన ధైర్యం, ఆత్మగౌరవం, ఐక్యతా స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఆయన చరిత్రను భావితరాలకు అందించడంతో పాటు సామాజిక సమానత్వం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా నేడు ట్యాంక్ బండ్ పై సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ చేస్తున్న తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గౌడ సంఘం నాయకులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బానోత్ హాతిరాం నాయక్, తోడేటి విజయ రాముడు గౌడ్, మండ రవి గౌడ్, కందునూరి శ్రీనివాస్ గౌడ్, కోల కుమార్ గౌడ్, మోత్కూరి వెంకట్రాజ్యం గౌడ్, కొత్తకొండ కుమార్ గౌడ్, మోత్కూరి సమ్మయ్య గౌడ్, కత్తి వెంకన్న గౌడ్, కత్తి శివ గౌడ్, తోడేటి నాగరాజుగౌడ్, నాగేశ్వరరావు గౌడ్, మోత్కూరి రమేష్ గౌడ్, గాజుల కృష్ణ గౌడ్, గాజుల ఐలయ్య గౌడ్, గోవర్ధన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పాపన్న గౌడ్ ను ఆదర్శంగా తీసుకోవాలి: గుణిగంటి మల్లేష్ గౌడ్

## పోచంపల్లిలో ఘనంగా పాపన్న జయంతి వేడుకలు



పాపన్న జయంతి వేడుకల్లో పాల్గొన్న గౌడ సంఘం నాయకులు

**హైదరాబాద్, పెన్ పవర్, ఆగస్టు 18:** బడుగులకు రాజ్యాధికార దిశగా పోరు విత్తనం నాటిన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని పోచంపల్లి గౌడ సంఘం అధ్యక్షులు గుణిగంటి మల్లేష్ గౌడ్ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మున్సిపల్ పరిధిలోని పోచంపల్లి గౌడ సంఘం కార్యాలయంలో మంగళవారం పాపన్న గౌడ్ చిత్రపటానికి గౌడ కులస్తులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామన్య కుటుంబం నుంచి ఎదిగిన సర్వాయి పాపన్న ప్రజలను ఏకం చేసి అప్పటి ఆధిపత్య వ్యవస్థలకు వ్యతిరేకంగా పోరాడారని కొనియాడారు. ప్రజల హక్కులు, గౌరవం, సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. పాపన్న పోరాటం కేవలం అధికార సాధనకే పరిమితం కాకుండా సామాజిక అసమానతలు, దోపిడీ, ఆధిపత్యానికి వ్యతిరేకంగా సాగిందని పేర్కొన్నారు. అణగారిన వర్గాల నుంచి నాయకత్వ లక్షణాలతో ఎదిగి ప్రజల కోసం పోరాడవచ్చని తన జీవితంతో నిరూపించారని అన్నారు. పాపన్న చూపిన ధైర్యం, ఆత్మగౌరవం, ఐక్యతా స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఆయన చరిత్రను భావితరాలకు అందించడంతో పాటు సామాజిక సమానత్వం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ట్యాంక్ బండ్ పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ చేస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గౌడ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం మాజీ అధ్యక్షులు కొయ్యడ యాదయ్య గౌడ్, గౌడ కుల నాయకులు చెరుకు బిక్షపతి గౌడ్, చెరుకు అంజయ్య గౌడ్, బండి యాదగిరి గౌడ్, తండ వెంకటేష్ గౌడ్, మక్తాల పోషయ్య గౌడ్, సార బాలయ్య, తంతరపల్లి వెంకటేష్, ముప్పిడి శ్రీనివాస్, చెరుకు మల్లయ్య, కట్కూరి పాండు, వేముల సుమన్ గౌడ్, కండె విజయ్ గౌడ్, కులస్తులు పాల్గొన్నారు.

# నేతాజీ అడుగుజాడల్లో యువత నడవాలి




చిత్రపటానికి పూలమాల వేస్తున్న యు ఎస్ ఎఫ్ ఐ నాయకులు

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 18:** యూఎస్ఎఫ్ఐ, గార్ల మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు అనంతరం ఈ సందర్భంగా యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాళోత్ శాంతికుమార్ మాట్లాడుతూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ భారత స్వాతంత్ర్య పోరాటంలో తనదైన ముద్ర వేసిన మహోన్నత నాయకుడని అన్నారు. సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం ఆయన ప్రదర్శించిన ధైర్యం, పట్టుదల, త్యాగం భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. దేశం కోసం నేతాజీ చేసిన పోరాటం నేటి యువత, విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని

విద్యార్థులు నేతాజీ జీవిత చరిత్రను, ఆయన పోరాట స్ఫూర్తిని అధ్యయనం చేయాలని సూచించారు. దేశం కోసం జీవితాన్ని అంకితం చేసిన నేతాజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. విద్య, ఉపాధి, సామాజిక న్యాయం, సమాన అవకాశాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. సమాజంలో అన్యాయం, అసమానతలు చోటుచేసుకున్నప్పుడు ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రశ్నించే ధైర్యాన్ని అలవర్చుకోవాలన్నారు.

విద్యార్థుల హక్కుల పరిరక్షణతో పాటు ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి యూఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తుందని తెలిపారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాలను కోరారు. నేతాజీ దేశభక్తి, క్రమశిక్షణ, ధైర్యం, త్యాగం వంటి విలువలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. జయంతి, వర్ధంతి కార్యక్రమాలకు పరిమితం కాకుండా ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడమే నిజమైన నివాళి అని అన్నారు.ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పవన్, అశోక్, గార్ల మండల నాయకులు తిరుమలేష్, నాగేష్, కళ్యాణ్, వీరన్న, రమేష్, కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు

**ఖమ్మం పెన్ పవర్ ఆగస్టు 18:** సర్దార్ సర్వాయి పాపన్న 376 వ జయంతి వేడుకలను ఖమ్మం ట్యాంక్ బండ్ పాపన్న విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. తొలుత ఖమ్మం అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్...అంబాల వెంకటేశ్వర్లు గౌడ్ తో కలిసి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగానివాళులర్పించారు. అనంతరం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18వ శతాబ్దం ప్రారంభంలో తెలంగాణ ప్రాంతంలో మొఘల్ సామ్రాజ్య విస్తరణ, స్థానిక జమీందారుల పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాడిన వీరుడని అన్నారు. బహుజన సమాజం హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.సామాజిక సమానత్వం, బహుజనుల అభ్యున్నతి కోసం పాపన్న గౌడ్ చూపిన మార్గాన్ని ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఆఫీసర్ జ్యోతి డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, ఖమ్మం జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు కత్తి నెహ్రూ గౌడ్, రాష్ట్ర నాయకులు అమరగాని వెంకన్న గౌడ్, మార్కం లింగయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పాపన్న విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

# ఫిల్టర్ బెడ్ పునరుద్ధరించాలి నీటి సరఫరా చేపట్టాలి



ఫిల్టర్ బెడ్ ను పరిశీలిస్తున్న సిపిఐ నాయకులు

**గార్ల ,పెన్ పవర్, ఆగస్టు 18:** గార్ల గ్రామ పంచాయతీ పరిధిలో ఏళ్ల తరబడి పట్టిపీడిస్తున్న మంచినీటి ఎద్దడి సమస్యకు అధికారులు, ప్రజాప్రతినిధులు శాశ్వత పరిష్కార మార్గం చూపాలని గార్ల మండల మాజీ వైస్ ఎంపీపీ కట్టేబోయిన శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలోని స్థానిక ఫిల్టర్ బెడ్‌ను మంగళవారం నాయకులు పరిశీలించారు. అనంతరం ఈ సందర్భంగా కట్టేబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ గార్ల గ్రామంలో గత రెండు రోజులుగా నల్లాల ద్వారా తాగునీరు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేసవి రాకముందే నీటి ఎద్దడి ప్రారంభం కావడం అధికారుల అలసత్వానికి నిదర్శనమన్నారు.

కొన్ని సాంకేతిక, నిర్వహణ లోపాల వల్ల తరచూ మంచినీటి సరఫరా నిలిచిపోతోందని, ప్రతిసారీ తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకోవడం సరైనది కాదన్నారు. ఫిల్టర్ బెడ్ వద్ద నిలిచిపోయిన నీటి శుద్ధి ప్రక్రియను వెంటనే పునరుద్ధరించి, గ్రామానికి నిరంతరం తాగునీరు అందేలా , శాశ్వత ఏర్పాట్లు చేయాలని కోరారు.సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని, లేనిపక్షంలో ప్రజలను సమీకరించి సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, భుక్య హరినాయక్, దారవత్ వీరన్న, మాజీ ఉపసర్పంచ్ లావుడ్య భీముడు, మాగం లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# పాపన్న ను స్ఫూర్తిగా తీసుకోవాలి: పన్యాల జైపాల్ రెడ్డి



పాపన్నకు నివాళులర్పిస్తున్న పన్యాల జైపాల్ రెడ్డి

**ఎల్బీనగర్, పెన్ పవర్, ఆగస్టు 18:** అణగారిన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న ను స్ఫూర్తిగా తీసుకోవాలని గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్యాల జైపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. సర్దార్ సర్వాయి పాపన్న 376వ జయంతి సందర్భంగా ఎల్బీనగర్ చౌరస్తాలో ఉన్న పాపన్న విగ్రహానికి జైపాల్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల హక్కుల కోసం పోరాడిన పోరాటయోధులను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ట్యాంకు బండ్ పై ఏర్పాటు చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, మంత్రులకు, అధికారులకు గౌడ కులస్తుల తరుపున పన్యాల జైపాల్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. నివాళులు అర్పించిన వారిలో ఉత్సవ కమిటీ సభ్యులు అంబాల మల్లేష్ గౌడ్, పల్లె గణేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండి.జానిమియా, నల్లంకి ధనరాజ్ గౌడ్, శ్రీధర్ గౌడ్, జహంగీర్ బాబు గౌడ్, స్వామి గౌడ్, పులి వెంకట్ గౌడ్, వెంకటేష్ గౌడ్, లక్ష్మీపతి గౌడ్, కిషోర్ గౌడ్, రాకేష్ గౌడ్, గౌడ కులస్తులు, నాయకులు ఉన్నారు.

# రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సర్పంచ్ ఉప్పల సోమన్నకు ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ నివాళులు

**డోర్నకల్: పెన్ పవర్,** మరిపెడ మండలం వెంకంపాడు గ్రామంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గ్రామ సర్పంచ్ ఉప్పల సోమన్న పార్థివ దేహానికి ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ గారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సోమన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. సర్పంచ్ ఉప్పల సోమన్న మృతి గ్రామానికి, ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మరిపెడ అధ్యక్షులు రవి నాయక్ గారు, మరిపెడ సర్పంచులు పెండ్లి శ్రీనివాస్ రెడ్డి గారు, గౌతమ్ గారు, బద్రు నాయక్ గారు, మాజీ మరిపెడ టౌన్ అధ్యక్షులు తాజుద్దీన్ గారు, ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లిలో బీఆర్ఎస్ మహిళా విభాగం అందోళన

**రంగారెడ్డి: పెన్ పవర్,** శేరిలింగంపల్లి నియోజకవర్గంలో షాదీ ముబారక్ పథకంపై రాజకీయ దుమారం రేగింది. షాదీ ముబారక్ పథకాన్ని రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నేతలు, మహిళా విభాగం ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు. శేరిలింగంపల్లి, పాపిరెడ్డి నగర్, మాదాపూర్ ప్రాంతాల్లో నిర్వహించిన ఆందోళనల్లో బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో అమలు చేసిన షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి, డబుల్ బెడ్రూం ఇళ్లు, వృద్ధాప్య, ఒంటరి మహిళల పెన్షన్లు, కేసీఆర్ కిట్ వంటి సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నీరుగారుస్తోందని ఆరోపించారు.

షాదీ ముబారక్ పథకంపై కోర్టు స్టే రావడం వెనుక ప్రభుత్వ కుట్ర ఉందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా ప్రజాక్షేత్రంలో పోరాటం కొనసాగిస్తామని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు.

# లక్షల మందిని ఆగం చేసిన మంత్రి పొంగులేటి రాజీనామా చేయాలి



**హైదరాబాద్ పెన్ పవర్:** లక్షల మందిని ఆగం చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తక్షణమే నైతిక బాధ్యత వహించి తన పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. దరఖాస్తులు లేకుండా ఎట్లైతే నిషేధిత జాబితాలో చేర్చారో అట్లనే తొలగించాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేసారు.

మంగళవారం నాడు మల్కాజ్గిరి జిల్లా వాజ్ పేయి నగర్ హనుమాన్ టెంపుల్ గ్రౌండ్ లో జరిగి లో 22ఏ నిషేధిత భూముల బాధితుల సభలో అయన పాల్గొన్నారు.

హరీష్ రావు మాట్లాడుతూ ప్రభుత్వం తప్పు చేస్తే.. ప్రజలకు ఎందుకు శిక్ష? 2008లో యూఎల్సీ రద్దయిన తర్వాత, మళ్లీ ఇప్పుడు ఈ భూములను రాత్రికి రాత్రి నిషేధిత జాబితాలో ఎందుకు పెట్టారు? ఒక్క రంగారెడ్డి జిల్లాలోనే 7,500 జీవోలతో, మేడ్చల్ జిల్లాలో 6,000 జీవోలతో లక్షలాది ఆస్తులను అడ్డగోలుగా నిషేధిత జాబితాలో చేర్చారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలు తన చేతిలోకి రావాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్వయంగా అధికారులను ఆదేశించి రాత్రికి రాత్రే ఈ ఆస్తులను బ్లాక్ చేయించారని అన్నారు. ఈ నిర్ణయంతో లక్షలాది అపార్ట్మెంట్లు, ఇళ్లు, ప్లాట్లను నిషేధిత జాబితాలో చేర్చి కాంగ్రెస్ ప్రభుత్వం సామాన్య ప్రజలను ఆగం చేసింది. దొంగతనం చేసిన దొంగ దొరికిపోయాక.. సారీ చెబితే చేసిన నేరం మాఫీ అయిపోతుందా? తప్పుకు శిక్ష పడాల్నా వద్దా? ఈరోజు నువ్వు చేసిన ఉద్దేశపూర్వక తప్పుకు లక్షల మంది ప్రజలు ఆగమయ్యారు. నిషేధిత జాబితా నుంచి ఆస్తులను తొలగించాలంటే 30 శాతం కమీషన్ అడుగుతున్నారట.. ఇది ముమ్మాటికీ 30 పర్సెంట్ కమీషన్ గవర్నమెంట్. పైగా ఆస్తులను 22ఏ నుంచి తీయాలంటే, ల్యాండ్ డెవలప్మెంట్ కూడా తమకే అప్పజెప్పాలని బ్లాక్ మెయిల్ చేస్తూ కండిషన్లు పెడుతున్నారని అన్నారు. అసలు నిషేధిత జాబితాలో భూములను పెట్టాలని చెప్పింది ఎవరు? దీనికి బాధ్యులు ఎవరు? తక్షణమే తేల్చాలి. ప్రజల ఈ కష్టానికి కారణమైన మంత్రులు.. అధికారుల పేరు చెప్పి తప్పించుకుంటామంటే మేము చూస్తూ ఊరుకోం. కుక్క తోకను ఆడిస్తదా లేక తోక కుక్కను ఆడిస్తదా? పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెబితేనే అధికారులు భూములను నిషేధిత జాబితాలో పెట్టారు తప్ప వాళ్లంతట వాళ్లు చేయలేదు. లక్షల మందిని ఆగం చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తక్షణమే నైతిక బాధ్యత వహించి తన పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. దరఖాస్తులు లేకుండా ఎట్లైతే నిషేధిత జాబితాలో చేర్చారో అట్లనే తొలగించాలని అన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంపై కవిత తీవ్ర విమర్శలు

**హైదరాబాద్ పెన్ పవర్:** సామాజిక న్యాయం పేరుతో సీఎం రేవంత్ రెడ్డి ప్రజలను మభ్యపెడుతున్నారని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. తెలంగాణ రక్షణ సేన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆమె, మంత్రివర్గంలో బీసీలు, మహిళలు, ఎస్సీ/ఎస్టీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని దుయ్యబట్టారు. 56 శాతం ఉన్న బీసీలకు కేవలం ముగ్గురికే, మహిళలకు ఇద్దరికే మంత్రి పదవులు ఇవ్వడం అన్యాయమన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకుని ఆగస్టు 6న 'సామాజిక న్యాయ సంకల్ప సభ' నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

మేము సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ పెట్టిన తర్వాతే ముఖ్యమంత్రి సామాజిక న్యాయం గురించి మాట్లాడటం మొదలుపెట్టాడు. మా సభ తర్వాత కచ్చితంగా సామాజిక తెలంగాణ గురించి మాట్లాడే అనివార్యత వస్తుందని చెప్పాం. ఇప్పుడు అదే జరిగింది. 31 నెలలుగా మాట్లాడని ముఖ్యమంత్రి మా ఒత్తిడి కారణంగా సామాజిక న్యాయం అనే మాట మాట్లాడుతున్నారు. మేము తీసుకొచ్చిన అనివార్యత కారణంగానే అధికారంలో ఉన్న పార్టీ దిగివచ్చి సామాజిక న్యాయం అంటోంది. కానీ ముఖ్యమంత్రి సామాజిక అన్యాయం అనాల్సింది పోయి సామాజిక న్యాయం అన్నట్లు అనిపిస్తోంది. ఎందుకంటే ఆయన చేసేదే సామాజిక అన్యాయం. కానీ సామాజిక న్యాయం అంటాడని అన్నారు.

నిజంగా సామాజిక న్యాయంపై చిత్తశుద్ధి ఉంటే మంత్రివర్గంలో 16 మంది ఉంటే ముగ్గురు మాత్రమే బీసీలు ఉంటారా? ఏడుగురు మాత్రమే బీసీలు ఉన్నారు. అందరికీ మంత్రి పదవులు సాధ్యమా అంటే ఎస్సీ, ఎస్టీలు ఉన్నారు కదా? వాళ్లలో మీకు ఎవరు కూడా అర్హత ఉన్నవాళ్లలాగ కనిపించలేదా? ఇద్దరు ఆడబిడ్డలకు మంత్రి పదవులు ఇచ్చామని చెబుతున్నారు. అది 33 శాతం అవుతుందా? తెలంగాణ ఉద్యమకారురాలు విజయశాంతి ని ఎమ్మెల్సీ చేసి సైలెంట్ చేశారు. ఆమెకు ఎందుకు మంత్రి పదవి ఇవ్వలేదు? అందుకే ఈ ముఖ్యమంత్రి సామాజిక న్యాయం అంటే మనం నమ్మవద్దు. మేక వన్నె పులి మాదిరిగా ఆయన సామాజిక న్యాయం అంటున్నాడని అన్నారు.

ఇటీవల అడ్వయిజరీ పదవులు వీహెచ్ కి, శశిధర్ రెడ్డి కి ఇచ్చారు. కానీ వీహెచ్ కి చాలా తక్కువ జీతం, తక్కువ ర్యాంక్ ఇచ్చారు? కాంగ్రెస్ లో ఎప్పటి నుంచో ఉండి మేము చిన్ననాటి నుంచి కూడా రాజీవ్ గాంధీ జయంతి నిర్వహిస్తున్న వ్యక్తి వీహెచ్. ఆయనకు తక్కువ జీతం, తక్కువ ర్యాంక్ ఇచ్చారు. శశిధర్ రెడ్డికి మాత్రం రెండున్నర లక్షల జీతం ఇచ్చారు. ఎందుకు వారిద్దరిలో అంత వత్యాసం? దీనికి ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలి. ఆర్టీఐ కమిషనర్లు ఇస్తే వారిలో ఒక్క బీసీ కూడా లేదు. పైగా ఆర్టీఐ కమిషనర్ భార్యను చిత్రపురి కాలనీ సొసైటీలో మెంబర్ ను చేశారు. చిత్రపురి కాలనీ వాళ్లకు న్యాయం చేస్తానని ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి ఊదరగొట్టారు. 52 జడ్జిమెంట్లు ఉన్నా సరే వారికి న్యాయం చేయటం లేదు. సంబంధం లేని వాళ్లకు సొసైటీలో పదవులు ఇచ్చారు. ఎటు పక్క చూసిన సరే అగ్రకులాలకు చెందిన వారికే పదవులు ఇస్తున్నారు. ఈ ముఖ్యమంత్రి మాట్లాడేది సామాజిక న్యాయం, కానీ చేసేది అటవీక న్యాయం. అడవిలో బలమైన జంతువుదే రాజ్యం. మనం అలా ఉండకూడదని సొసైటీగా ఉండాలని అనుకున్నాం. మాటల్లో కాకుండా చేతల్లో సామాజిక న్యాయం అనేది చేసి చూపాలి. గత రెండేళ్లలో 5 లక్షల 96 వేల కోట్ల బడ్జెట్ పెడితే బీసీల కోసం ఖర్చు చేసింది 5 వేల 5 వందల కోట్లే. అంటే ఒక్క శాతం మాత్రమే బీసీల కోసం ఖర్చు చేశారంటే ఎంత అన్యాయం. బీసీల జనాభా ఎంత? మీరు ఖర్చు చేసింది ఎంత? మహిళలపై కూడా మీకు గౌరవం లేదు. గాంధీ భవన్ లో ఎంతమంది మహిళలు పదవుల కోసం ధర్నా చేశారు? ప్రియాంక గాంధీ పోటీ చేస్తే మీరంతా వెళ్లి గెలిపించుకుంటారు. కానీ మీనాక్షి నటరాజన్ ను మాత్రం ఈ ముఖ్యమంత్రే కుట్ర చేసి ఓడిస్తాడు. ఇదేనా మీరు చెప్పే సామాజిక న్యాయం, మాటల్లో కాదు చేతల్లో ఉండాలి. యాదగిరి గుట్టలో డిప్యూటీ సీఎం గారిని కింద కూర్చోబెట్టి అవమానించారు. ఎంపీ వంశీ కి కనీసం పుష్కరాల ఇన్విటేషన్ కూడా ఇవ్వలేదు. బీసీ బిడ్డలు మంత్రి వాకిటి, కొండా సురేఖలను పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఘోరంగా అవమానించారు. పొంగులేటి కన్నా సీనియర్ అయిన కొండా సురేఖను అవమానించలేదా? లంబాడాలు మినిస్టర్ గా లేని ఏకైక కేబినెట్ మీదేనని ఆరోపించారు.

## హనుమకొండలో వ్యక్తి దారుణ హత్య

**హనుమకొండ: పెన్ పవర్:** హనుమకొండ జిల్లా కాజిపేట మండలం రాంపూర్ ఊరచెరువు వద్ద పోలు వెంకటేశ్వర్లు (45) అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. మృతుడిని చిల్పూర్ గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. మృతదేహంపై కత్తిపోట్లు ఉండటంతో గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఘటన స్థలానికి చేరుకున్న ధర్మసాగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

## కీచక లెక్చరర్ను చితకబాదిన ఏబీవీపీ కార్యకర్తలు

**నల్లగొండ: పెన్ పవర్:** దేవరకొండ ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో లెక్చరర్ విద్యార్థినులు వేధింపులు గురిచేస్తున్నాడన్న సమాచారం లో ఏబీవీపీ కాలేజీ ఎదుట అందోళనకు దిగింది. లెక్చరర్ భాస్కర్ కొంతకాలంగా విద్యార్థినులను గా లైంగికంగా వేధిస్తున్నాడని ఆరోపణలు వెల్లువెత్తాయి. మంగళవారం కాలేజీ ముందు అందోళనకు దిగిన ఏబీవీపీ కార్యకర్తలు లెక్చరర్ మద్యం తాగి వచ్చాడని నిర్ధారించారు. లెక్చరర్కు దేహశుద్ధి చేసారు. . పోక్సో కేసు నమోదు చేయాలని డిమాండ్ చేసారు.

## జూబ్లీహిల్స్, బంజారాహిల్స్లో కొత్త గా వన్వేలు..

# వాహనదారుల అయోమయం

**హైదరాబాద్ పెన్ పవర్:**
నగరంలోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లో మంగళవారం నుంచి అమల్లోకి వచ్చిన వన్వే నిబంధనలతో వాహనదారులు అయోమయం, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ గందరగోళంలో కొత్త మార్గాల్లో ప్రయాణించాల్సి రావడం, ఆఫీసులు, ఇళ్లకు చేరుకోవడానికి ఉద్యోగులకు అదనంగా సమయం పడుతోంది. సాధారణంగా వెళ్లే దారులు మూసివేయడంతో గల్లీ రోడ్లలోకి వాహనాలు మళ్లుతున్నాయి. దీంతో చిన్నచిన్న రహదారుల్లోనూ భారీగా ట్రాఫిక్ జామ్లు ఏర్పడుతున్నాయి. వన్వే నిబంధనల కారణంగా తమ ప్రయాణ దూరం పెరిగిందని వాహనదారులు చెబుతున్నారు. దీంతో పెట్రోల్, డీజిల్ ఖర్చులు కూడా పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్సుల్లో ప్రయాణించే వారు సైతం మారిన మార్గాల కారణంగా ఆలస్యంగా గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. ఈ ట్రాఫిక్ ఆంక్షలు రెండేళ్లపాటు కొనసాగితే పరిస్థితి ఎలా ఉంటుందోనని నగరవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేసి, వాహనదారులకు ఇబ్బందులు తగ్గించాలని కోరుతున్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ. వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# రాజకీయ దిగజారుడుతనానికి పరాకాష్టా?

**హైదరాబాద్, ఆగస్టు 18 పెన్ పవర్:**
తెలంగాణ రాజకీయాలు రోజురోజుకూ సరికొత్త వివాదాలకు కేంద్రబిందువుగా మారుతున్నాయి. అభివృద్ధి, ప్రజా సమస్యలు, సంక్షేమ పథకాల అమలుపై జరగాల్సిన రాజకీయ చర్చ.. క్షుద్రపూజలు, అఘోరా యాగాల స్థాయికి దిగజారడం రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని విస్మయానికి గురిచేస్తోంది. ములుగు జిల్లా వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలను టార్గెట్ చేస్తూ చేసిన అఘోరా పూజల వ్యాఖ్యలు, దానికి మాజీ మంత్రి హరీష్ రావు ఇచ్చిన ఘాటు కౌంటర్ ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర రాజకీయ దుమారాన్ని రేపుతున్నాయి. ములుగులో ఆదివారం జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేరుగా ప్రతిపక్ష బీఆర్ఎస్ అగ్రనేతలను లక్ష్యంగా చేసుకుని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఒక కీలక 'మేనల్లుడు' పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడులకు వెళ్లి అఘోరా పూజలు, క్షుద్ర తంత్రాలు చేయించారని ఆరోపించారు. తెలంగాణలో వర్షాలు కురవకూడదని, కరవు తాండవించాలని, తద్వారా కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డపేరు రావాలని కోరుకుంటూ ఈ క్షుద్ర క్రియలకు పాల్పడ్డారని సీఎం విమర్శించారు. "ప్రజలు చనిపోయినా పర్వాలేదు.. ప్రభుత్వానికి చెడ్డపేరు రావాలన్నదే వారి కుట్ర. ఎన్ని క్షుద్రపూజలు చేసినా భగవంతుడు ప్రజాపక్షాన నిలబడ్డాడు కాబట్టే వర్షాలు సమృద్ధిగా కురిసి ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నిండింది" అంటూ రేవంత్ రెడ్డి తీవ్ర పదజాలంతో ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఈ ఆరోపణలపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు తక్షణమే స్పందించారు. ఈ వ్యాఖ్యలను పూర్తిగా నిరాధారమైనవిగా, రాజకీయ దిగజారుడుతనంగా కొట్టిపారేశారు. పాలనా వైఫల్యాలు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలు నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి ఇలాంటి చౌకబారు ప్రచారాలకు దిగుతున్నారని ఎద్దేవా చేశారు. "ఇలాంటి వ్యక్తిగత దాడులకు, చిల్లర రాజకీయాలకు నేను భయపడను. రైతులు, విద్యార్థులు, సామాన్య ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటాను" అని స్పష్టం చేశారు. తనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని, కోర్టుల ద్వారా న్యాయపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఇప్పటికే తనపై ఇలాంటి ఆరోపణలు చేసినందుకు పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి సామ రామ్మోహన్ రెడ్డిలకు లీగల్ నోటీసులు పంపిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. సాగుతున్న ఈ ఘర్షణ కేవలం రెండు పార్టీల ఆరోపణలకే పరిమితం కాలేదు. దీని వెనుక వ్యూహాత్మక రాజకీయ ఎత్తుగడలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ నేతలు రాష్ట్ర క్షేమాన్ని కోరుకోవడం లేదని, అధికారం కోసం రాష్ట్ర ప్రజలకు హాని తలపెట్టే స్థాయికి వెళ్లారనే భావనను ప్రజల్లో బలంగా నాటడం అధికార కాంగ్రెస్ వ్యూహంగా కనిపిస్తోంది. ఎన్నికల హామీలు, రుణమాఫీ, ఇతర పరిపాలనాపరమైన సమస్యలను ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కోలేకనే 'చేతబడి', 'క్షుద్రపూజలు' వంటి పాతకాలపు సెంటిమెంట్లను తెరపైకి తెచ్చి ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని బీఆర్ఎస్ ఎదురుదాడి చేస్తోంది. కాంగ్రెస్ నేతలు రాజకీయ సభల్లో పర్సెప్షన్ వార్ సాగిస్తుంటే, హరీష్ రావు లీగల్ నోటీసుల ద్వారా కాంగ్రెస్ నేతలను న్యాయపరంగా ఇరుకున పెట్టాలని చూస్తున్నారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలు, తాగునీరు, విద్య, ఉద్యోగాల కల్పనపై నిర్మాణాత్మక చర్చ జరగాల్సిన తరుణంలో, ప్రధాన పార్టీల మధ్య క్షుద్రపూజల చుట్టూ రాజకీయాలు నడవడం ప్రజాస్వామ్యానికి ఏమాత్రం ఆరోగ్యకరం కాదు. ఒకరిపై ఒకరు నైతికతను కోల్పోయి చేసుకుంటున్న ఈ వ్యక్తిగత ఆరోపణలు ప్రజాక్షేత్రంలో ఏ మేరకు ప్రభావం చూపుతాయో, ప్రజలు ఎవరి వాదనను విశ్వసిస్తారో వేచి చూడాల్సిందే

# సంక్షేమ పథకాలపై క్రెడిట్ వార్

**హైదరాబాద్, ఆగస్టు 18 పెన్ పవర్:**
తెలంగాణ రాజకీయాల్లో ప్రచార ఆధిపత్యం సరికొత్త మలుపు తిరిగింది. సంక్షేమ పథకాల క్రెడిట్ ఎవరిదనే అంశంపై అధికార కాంగ్రెస్, విపక్ష బీజేపీ మధ్య మొదలైన వాగ్వాదం ఇప్పుడు 'ఫోటోల వార్'గా మారింది. సంక్షేమ పథకాల్లో ప్రధాని నరేంద్ర మోదీ ఫోటో ముద్రించాలని బీజేపీ పట్టుబడుతుండగా, కేంద్ర పథకాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటో ఎందుకు పెట్టకూడదని కాంగ్రెస్ ఎదురుదాడికి దిగిందితెలంగాణలో కొత్తగా జారీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోదీ ఫోటోను పక్కనపెట్టి సీఎం, మంత్రుల ఫోటోలు ఎలా ముద్రిస్తారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. తెలంగాణలో 57 లక్షల రేషన్ కార్డుల ద్వారా దాదాపు 2 కోట్ల మంది ప్రజలకు కేంద్ర ప్రభుత్వమే ఉచితంగా బియ్యం అందిస్తోందని, అలాంటప్పుడు ఆ పథకానికి సంబంధించిన కార్డులపై మోదీ చిత్రం ఎందుకు ఉండకూడదని నిలదీశారు. గత 12 ఏళ్లలో తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రం రూ.13 లక్షల కోట్లు ఖర్చు చేసిందని, అదనంగా బుల్లెట్ రైన్ కారిడార్ కోసం మరో రూ.1.5 లక్షల కోట్లు వెచ్చించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. పంచాయతీల అభివృద్ధికి కేంద్రం నిధులిస్తే గత బీఆర్ఎస్ ప్రభుత్వం నాటకాలాడుతూ క్రెడిట్ కొట్టేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలను విస్మరిస్తూ '22ఏ నిషేధిత భూముల జాబితా' పేరిట గత రెండేళ్లుగా దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు. బండి సంజయ్ వ్యాఖ్యలకు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ నుంచి పన్నుల రూపంలో కేంద్రానికి భారీగా ఆదాయం వెళ్తోందని స్పష్టం చేశారు. జీఎస్టీతో పాటు ఇతర మార్గాల ద్వారా రాష్ట్రం నుంచి కేంద్ర ప్రభుత్వానికి భారీ మొత్తంలో పన్నుల రాబడి అందుతోందని, అందువల్ల రాష్ట్రంలో అమలయ్యే కేంద్ర పథకాలన్నింటిపై సీఎం రేవంత్ రెడ్డి ఫోటో పెట్టాలని డిమాండ్ చేశారు. కేంద్రానికి రాష్ట్రం చెల్లిస్తున్న పన్నులు ఎంత? తిరిగి కేంద్రం నుంచి రాష్ట్రానికి కేటాయిస్తున్న నిధులు ఎంత? అనే అంశంపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో బలంగా ఉందని, తుమ్మితే ఊడిపోయే ప్రభుత్వం ఎవరిదో బండి సంజయ్ తెలుసుకోవాలని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో పోటీకి నిలబడే సత్తా బీజేపీకి ఉందా అని ప్రశ్నించారు. తెలంగాణలో మొదలైన ఈ వివాదం కేవలం ఒక ఫోటోకు సంబంధించినది మాత్రమే కాదు.. సంక్షేమ పథకాల అమలులో ఓటర్లను ఆకట్టుకునేందుకు జరుగుతున్న రాజకీయ పోరాటం. ఉచిత బియ్యం కేటాయింపులు తమవేనని కేంద్రం చెబుతుంటే, రాష్ట్రానికి రావాల్సిన న్యాయబద్ధమైన నిధులను ప్రస్తావిస్తూ ఫెడరల్ హక్కుల కార్డును కాంగ్రెస్ ముందుకు తెస్తోంది. కార్డులపై, పోస్టర్లపై ఫోటోల ప్రాధాన్యత ఎవరు దక్కించుకుంటారనే అంశం రాబోయే రోజుల్లో ఇరు పార్టీల మధ్య మరింత రాజకీయ వేడిని పెంచే అవకాశం ఉంది.


# డిజిటల్ ఓ వైపు... ఫీల్డ్ లో మరో వైపు




**హైదరాబాద్, ఆగస్టు 18 పెన్ పవర్:**
తెలంగాణ రాజకీయ యుద్ధం ప్రస్తుతం రెండు పారలర్ ఫీల్డ్స్లో జరుగుతోంది. ఒకవైపు డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను, సోషల్ మీడియా సామ్రాజ్యాన్ని బీఆర్ఎస్ ముట్టడిస్తుంటే.. మరోవైపు క్షేత్రస్థాయి మాస్ రాజకీయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ తన గుప్పిట్లో ఉంచుకుంటోంది. ఈ రెండు ఫీల్డుల్లో తమకు బలం ఉన్న ఫీల్డుల్లోనే రెండు పార్టీలు పోరాటాలు చేస్తున్నాయి కానీ మరో ఫీల్డులోకి వెళ్లేందుకు ఆసక్తి చూపించడం లేదు. కేటీఆర్ నిర్వహించే విలేకరుల సమావేశాలు మినహా బీఆర్ఎస్ పార్టీ క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష ఆందోళనలకు దూరంగా ఉంటున్నప్పటికీ, సోషల్ మీడియా వేదికగా విపరీతమైన కంటెంట్‌తో సంచలనం సృష్టిస్తోంది. యూట్యూబ్ ఛానళ్లు, ట్విట్టర్ , ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్స్ , ఇన్ఫ్లుయెన్సర్ల నెట్‌వర్క్ ద్వారా డిజిటల్ నెట్‌వర్క్‌ను సద్వినియోగం చేసుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరంతరం వ్యతిరేకతను ప్రచారం చేయడంలో బీఆర్ఎస్ శ్రేణులు ముందంజలో ఉన్నాయి. దీనికి పూర్తి భిన్నంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహం సాగుతోంది. డిజిటల్ స్పేస్ కంటే ప్రజల మధ్య ప్రత్యక్షంగా ఉండే సభలకే ఆయన ప్రాధాన్యతనిస్తున్నారు. వారంలో రెండు మూడు బహిరంగ సభలు లేదా ప్రభుత్వ కార్యక్రమాలలో పాల్గొంటూ నేరుగా ప్రజా బాహుళ్యంలోకి వెళ్తున్నారు. రేవంత్ ప్రసంగాలు కేవలం ప్రభుత్వ సంక్షేమ పథకాలకే పరిమితం కాకుండా, పొలిటికల్ మాస్ డైలాగ్‌లు, వైరల్ స్టేట్‌మెంట్లతో బీఆర్ఎస్‌ను ఎండగట్టేలా ఉంటున్నాయి. అఘోరాలతో క్షుద్ర పూజలు చేయిస్తున్నారు , బిఆర్ఎస్ నాయకుల రక్తాన్ని కూడాఅమ్ముకుంటున్నారు వంటి తీవ్రమైన , వివాదాస్పద ఆరోపణలు చేస్తూ
వార్తల్లో నిలుస్తున్నారు. రేవంత్ విసిరే ఈ మాస్ పొలిటికల్ అటాక్స్‌కు రాజకీయంగా ప్రత్యక్ష సమాధానం చెప్పలేక, డిజిటల్ కౌంటర్లు ఇవ్వడానికే బీఆర్ఎస్ పరిమితమవుతోంది. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై లీగల్ నోటీసులు పంపడం, కేసులు పెడతామని హెచ్చరించడం వంటి న్యాయప రమైన రక్షణ మార్గాలను బీఆర్ఎస్ వెతుక్కుంటున్నప్పటికీ, ఫీల్డ్‌లో రేవంత్ సృష్టిస్తున్న రాజకీయ
ప్రభావాన్ని తిప్పికొట్టడంలో ఆ పార్టీ కొంత వెనుకబడిందనే అభిప్రాయాలు ఉన్నాయి. కేటీఆర్ లీగల్ నోటీసుల హడావుడిని సైతం రేవంత్ రెడ్డి పబ్లిక్ మీటింగ్స్‌లో పొలిటికల్ మైలేజ్ కింద మార్చుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో సొంతంగా బలమైన సోషల్ మీడియా ఈకోసిస్టమ్ లేకపోవడం అతిపెద్ద బలహీనత. డిజిటల్ మీడియాలో వచ్చే విమర్శలను తిప్పికొట్టే దిశగా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వింగ్ సరైన ప్రభావం చూపలేకపోతోంది. అయితే, ఆ లోపాన్ని రేవంత్ రెడ్డి తన సుడిగాలి పర్యటనలు, మాస్ ప్రసంగాలతో భర్తీ చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఆన్‌లైన్ రాజకీయంలో బీఆర్ఎస్ చక్రం తిప్పుతుంటే, ఆఫ్ లైన్ గ్రౌండ్ రాజకీయంలో కాంగ్రెస్ తన పట్టును నిలుపుకోవడానికి ప్రయత్నిస్తోంది. ఈ రెండు సమాంతర శక్తుల యుద్ధంలో ఏ వేదిక ప్రజాభిప్రాయాన్ని ఎక్కువగా ప్రభావితం చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది

# ఏపీ లో థర్డ్ ఫ్రెంట్: వ్యూహాలకు పదును.. !

**హైదరాబాద్ పెన్ పవర్:** వచ్చే ఎన్నికల నాటి కి రాష్ట్రంలో రాజకీయ వ్యూహాలు మారుతున్నాయా? ముఖ్యంగా చిన్న చితకా పార్టీలు చేతులు కలపనున్నాయా? అంటే.. ఔననే సమాధానమే వినిపిస్తోంది. దీనికి సంబంధించి గ్రౌండ్ వర్క్ కూడా జోరుగా సాగు తున్నట్టు చెబుతున్నారు. ప్రస్తుతం మూడు పార్టీలైన టీడీపీ-బీజేపీ-జనసేన కూటమిగా ఉన్నాయి. వచ్చే ఎన్నికల్లో నూ ఈ మూడు పార్టీలు బలమైన పోటీ ఇవ్వనున్నాయి. ఇక, వైసీపీ ఒంటరి పోరువైపే మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది. నిజానికి గత కొన్నాళ్లుగా వైసీపీతో చెలిమికి కొన్ని పార్టీలు మొగ్గు చూపాయి. ముఖ్యంగా కమ్యూనిస్టులు, జై భారత్ భీం పార్టీ వంటివి వైసీపీతో కలిసి ముందుకు సాగాలని అనుకున్నాయి. కానీ, ఆ అవకాశం వైసీపీ ఇవ్వట్లేదని తెలుస్తోంది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ ఉన్నా.. ఆ పార్టీతో జట్టు కట్టాలని అనుకున్నా.. అసలు ఎక్కడా పార్టీ పరిస్తితి పడ్డ చోట నుంచి లేచే ప్రయత్నం కూడా చేయకపోవడం గమనార్హం. దీంతో కాంగ్రెస్ పార్టీ వైపు ఎవరూ తొంగి చూడడం లేదు. దీంతో తృతీయ ప్రత్యామ్నాయం ఏర్పాటుపై పార్టీలు దృష్టి పెట్టాయి. దీనిలో భాగంగా ఇటీవల తిరుపతి, విజయవాడల్లో సమావేశాలు జరగడం గమనార్హం. ప్రస్తుతం ఉన్న అంచనాల ప్రకారం.. కమ్యూనిస్టులు కలివిడిగా ముందుకు సాగడంతోపాటు.. మాజీ ఐపీఎస్ వెంక టేశ్వరరావు



పెట్టబోయే(?) పార్టీ సహా.. ఆమ్ ఆద్మీ, బీఎస్పీ, మాజీ ఐఏఎస్ విజయ్ కుమార్ నేతృత్వంలోని రిపబ్లికన్ పార్టీ, జైభారత్ భీం సహా.. మరికొన్ని పార్టీలు చేతులు కలిపేందుకు రెడీ అయ్యాయి. ఇదే విషయాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు వెల్లడించడం గమనార్హం. అలానే మాజీ ఐపీఎస్ వెంకటేశ్వరరావు కూడా చెప్పుకొచ్చారు. వచ్చే ఎన్నికల నాటికి తృతీయ ఫ్రంట్ ఏర్పాటుపై త్వరలోనే ప్రకటిస్తామని అన్నారు.

**ఎవరికి ఇబ్బంది.. ?**

తృతీయ ఫ్రంట్ కనుక రంగంలోకి దిగితే.. ప్రధానంగా వైసీపీకి తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని భావిస్తున్నారు.

సహజంగానే ఏర్పడే ప్రభుత్వ వ్యతిరేక ఓటు బ్యాంకు చీలిపోయి.. ఈ తృతీయ పక్షం పార్టీలకు పడే అవకాశం ఉందని.. తెలుస్తోంది. నియోజకవర్గానికి 5 నుంచి 10 వేల ఓట్ల మధ్యలో చీలిపోయినా.. అది కూటమి పార్టీలకు మేలు చేస్తుందని అంటున్నారు. ఇదే సమయంలో వైసీపీకి పెద్ద ప్రమాదం తప్పదన్న లెక్కలు వస్తున్నాయి. ఇక, కూటమి విషయాని కి వస్తే.. వ్యతిరేక ఓటు బ్యాంకు చీలిపోతే..మరోసారి కూటమి అధికారంలోకి రావడం తథ్యం. ఇక, అధికారమే పరమావధిగా తృతీయ కూటమి ఏర్పడుతున్నా.. అది సాధ్యం కాకపోవచ్చు.

# మాజీ మంత్రి కుమారుడికి పెళ్లి ఇష్టం లేదా.. సోషల్ మీడియాలో వైరల్!

**విజయవాడ, ఆగస్టు 18 పెన్ పవర్:**
వైసీపీకి చెందిన మాజీ మంత్రి జోగి రమేష్ కుటుంబంపై సొంత కోడలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ కుటుంబ వ్యవహారం కాస్త రచ్చకు దారితీసింది. ఆ కుటుంబ సభ్యులు 11 మందిపై పోలీసులు కేసు నమోదు కూడా చేశారు. ఒకవైపు ఈ కేసు విచారణ కొనసాగుతుండగా.. ఆ కుటుంబానికి చెందిన వ్యక్తిగత వ్యవహారం సోషల్ మీడియాలో వెలుగులోకి వచ్చింది. ఆ కుటుంబ సభ్యుల మధ్య జరిగిన సంభాషణకు సంబంధించి వీడియో వైరల్ అవుతోంది. మాజీ మంత్రి జోగి రమేష్ కుమారుడికి ఇష్టం లేని పెళ్లి చేశారని వెలుగు చూస్తోంది ఆ వీడియోలో. ఏకంగా జోగి రమేష్ కుమారుడు రాజీవ్ తనకు ఈ పెళ్లి ఇష్టం లేదన్నట్టు చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. అనవసరంగా తనను ఒత్తిడి చేసి పెళ్లి చేయించారని ఆయన మాట్లాడుతున్న అంశాలకు సంబంధించి వీడియో వైరల్ అవుతోంది.మొన్న మధ్యన మాజీమంత్రి జోగి రమేష్ కుటుంబం పై ఆయన కోడలు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. తన అత్తవారు ఇంట తనకు మానసికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని.. తీవ్రంగా హింసిస్తున్నారని.. గృహ హింసకు పాల్పడ్డారని.. ఒకటి రెండుసార్లు హత్య ప్రయత్నం చేశారని ఆమె ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే జోగి రమేష్ మాజీ మంత్రి కావడం.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కావడం తీవ్ర చర్చకు దారితీసింది. పైగా ఆమె తెలంగాణకు చెందిన యువతి కావడంతో తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారింది ఈ ఘటన. అయితే దీనిని రాజకీయ కుట్రగా అభివర్ణించారు జోగి రమేష్ కుటుంబ సభ్యులు. కానీ గత కొంతకాలంగా జరుగుతున్న వ్యవహారాలతోనే బాధితురాలు బయటకు వచ్చినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. కేవలం జోగి రమేష్ కుటుంబ సభ్యులు మాత్రమే కాదు సమీప బంధువులు 11 మంది తనపై వేధింపులకు గురి చేశారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దానిపై పోలీసులు కేసు నమోదు చేశారు.అయితే తాజాగా ఈ ఘటనకు సంబంధించి నిందితుల్లో ఒకడైన జోగి రమేష్ కుమారుడు రాజీవ్ తనకు ఈ పెళ్లి ఇష్టం లేదని.. కుటుంబ సభ్యుల బలవంతంగా ఈ పెళ్లికి ఒప్పించారని చెబుతున్న వీడియో సోషల్ మీడియాలో వెలుగులోకి వచ్చింది. అయితే ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదైన తర్వాత జోగి రమేష్ కోడలి కుటుంబ సభ్యులకు జరిగిన చర్చలు బయటకు వచ్చాయి. అసలు తనకు ఈ వివాహం ఇష్టం లేదని.. అర్ధరాత్రి దాటిన తర్వాత వేకువ జాము వరకు తనకు వైట్ వాష్ చేశారని.. బలవంతంగా ఒప్పించారంటూ జోగి రమేష్ కుమారుడు రాజీవ్ తండ్రి పై తిరగబడుతున్న వీడియోలకు సంబంధించిన దృశ్యాలు ఇప్పుడు బయటకు వచ్చాయి.. అయితే ఆ కుటుంబంలో అంతర్గతంగా జరిగిన చర్చలు బయటకు రావడం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారుతోంది. అయితే సొంత కుటుంబ సభ్యులే ఈ వీడియో లిఫ్ట్ చేశారని అర్థం అవుతోంది. కాగా ఈ సోషల్ మీడియాలో ప్రస్తుతం ఈ దృశ్యాలు వైరల్ అవుతున్నాయి.

# 'పవన్ ను ముఖ్యమంత్రి చేసేందుకే జనసేన' - ఎమ్మెల్యే నానాజీ సంచలన వ్యాఖ్యలు

టీడీపీ-జనసేన పొత్తు విషయంలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ సంచలన వ్యాఖ్యలు చేశారు. టీడీపీ కోసమే జనసేన పనిచేస్తుందంటూ జరుగుతున్న ప్రచారంపై స్పందించిన ఆయన కొత్త వివాదానికి తెర తీశారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. 'టీడీపీకి కాపు కాయడానికి జనసేన లేదు. పవన్ కల్యాణ్ ను ముఖ్యమంత్రి చేయడానికే పార్టీ పెట్టాం' అంటూ ఎమ్మెల్యే నానాజి మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కాకినాడ రూరల్ నియోజకవర్గం కార్యకర్తల సమావేశంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా ఇరుపార్టీల మధ్య వేడి రాజేసే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. స్థానిక ఎన్నికల ముందు కార్యకర్తలను రెచ్చగొట్టేలా ఎమ్మెల్యే వ్యాఖ్యలు ఉన్నాయని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

ఏపీలో టీడీపీ-జనసేన పొత్తు బలమైన బంధంగా మారడంతో 2024 ఎన్నికల్లో తిరుగులేని విజయం అందుకున్న విషయం తెలిసిందే. రెండేళ్లుగా పొత్తు ధర్మం పాటిస్తూ ఇరుపార్టీల అధినేతలు ఎంతో జాగ్రత్తగా నడుచుకుంటున్నా, క్షేత్రస్థాయిలో వాతావరణం అలా లేదని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే వ్యాఖ్యలు బట్టి అర్థం అవుతోందని పరిశీలకులు అనుమానిస్తున్నారు. పొత్తుల వల్ల తమకు సరైన గుర్తింపు రావడం లేదని జనసేన కార్యకర్తలు భావిస్తున్నారా? అన్న సందేహాలను కూడా వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ కోసమే జనసేన పనిచేస్తున్నట్లు ఉందన్న రాజకీయ ప్రత్యర్థుల విమర్శలకు జనసేన శ్రేణులను ప్రభావితం అవుతున్నట్లు కనిపిస్తోందన్న అభిప్రాయమూ వ్యక్తం చేస్తున్నారు. కూటమిగా మరో 15 ఏళ్లు కలిసి



పనిచేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పదేపదే చెబుతున్నారు. అదే సమయంలో ఇరుపార్టీల ద్వితీయశ్రేణి నాయకులు కలిసిమెలిసి ఉండాలని, రాజకీయ ప్రత్యర్థుల పన్నాగాలను పసిగట్టి విభేదాలు తలెత్తకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని కోరుతున్నారు. కానీ, క్షేత్రస్థాయిలో నేతలు అధినేతల సూచనలకు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వనట్లు కనిపిస్తోందని ఇలాంటి ఘటనలు రుజువు చేస్తున్నాయని వ్యాఖ్యానిస్తున్నారు. రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వం అవసరమని, ఆయన విజన్ కోసం కలిసి పనిచేద్దామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్వయంగా చెబుతున్నప్పటికీ, ఆయన పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఆ స్థాయి నాయకులు మాత్రం పవన్ ను ముఖ్యమంత్రి చేస్తామంటూ చేస్తున్న ప్రకటనలు వివాదానికి కారణమవుతున్నాయని అంటున్నారు. శాసనసభ సమావేశాలు జరుగుతున్న సమయంలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే టీడీపీకి కాపు కాయడానికి జనసేన లేదంటూ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం సృష్టిస్తున్నాయని చెబుతున్నారు. ఆయన ఏ ఉద్దేశంతో ఇలా మాట్లాడారో తెలియదు కానీ, టీడీపీ కార్యకర్తలు, నాయకులను రెచ్చగొట్టేలా ఉన్నాయని మాత్రం చెబుతున్నారు. ఇక ఈ అంశంపై జనసేన అధిష్టానం ఎలా స్పందిస్తుందనేది చూడాల్సివుందని అంటున్నారు.

## తిరుపతి సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులో ఏసీబీ సోదాలు..
# రూ.2.48 లక్షల నగదు స్వాధీనం

**తిరుపతి: పెన్ పవర్:** తిరుపతిలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. సాయంత్రం 7 గంటల ప్రాంతంలో ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసులు సిబ్బందితో కార్యాలయానికి చేరుకుని సోదాలు చేపట్టారు. దీంతో సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్లలో కలకలం రేగింది. కార్యాలయంలో తనిఖీలు నిర్వహించిన ఏసీబీ అధికారులు లెక్కల్లో చూపని రూ. 2.48 లక్షల నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆ నగదు వివరాలకు సంబంధించి సబ్ రిజిస్ట్రార్ లక్ష్మీదేవిని విచారించారు. నగదుతోపాటు కార్యాలయంలోని రిజిస్ట్రేషన్ రికార్డులను, సంబంధిత దస్తావేజులను, నగదు లావాదేవీలకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. ఏసీబీ తనిఖీలు కొనసాగుతుండడంతో కార్యాలయానికి వచ్చిన డాక్యుమెంట్ రైటర్లు ఆందోళనకు గురయ్యారు. దీంతో వీరిని కూడా విచారిస్తున్నట్టు సమాచారం. డీఎస్పీ శ్రీనివాసులు మీడియాతో మాట్లాడుతూ అవినీతి ఫిర్యాదులు రావడంతో తనిఖీలు జరిపామన్నారు. అన్ అకౌంటెడ్‌గా ఉన్న రూ2. 48లక్షలను స్వాధీనం చేసుకున్నామని, సోమవారం జరిగిన 42 రిజిస్ట్రేషన్లను కూడా పరిశీలిస్తున్నామన్నారు

# చంద్రుడిపై శాశ్వత అడుగులు

**విజయవాడ, ఆగస్టు 18 పెన్ పవర్:** చంద్రుడిపై మనిషి ఎక్కువకాలం నివసించగలడా? అక్కడే ఉండి పరిశోధనలు చేయడం, అవసరమైన వనరులను వినియోగించుకోవడం సాధ్యమేనా? ఈ ప్రశ్నలకు సమాధానం వెతుకుతూ అమెరికా అంతరిక్ష సంస్థ కీలక ప్రణాళికతో ముందుకు వెళ్తోంది. చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంలో దశలవారీగా ఏర్పాటు చేసి, భవిష్యత్‌లో అక్కడ దీర్ఘకాలిక మానవ ఉనికికి పునాది వేయాలని నాసా లక్ష్యంగా పెట్టుకుంది. నాసా ప్రస్తుత ప్రణాళిక ప్రకారం 2029-32 మధ్య ప్రారంభ నివాస సదుపాయాలను ఏర్పాటు చేసి, 2032 తర్వాత చంద్రుడిపై నిరంతర మానవ కార్యకలాపాలను విస్తరించనుంది చంద్రుడిపై శాశ్వత స్థావరం ఏర్పాటు చేయడం అంత సులభమైన విషయం కాదు. తీవ్రమైన ఉష్ణోగ్రతలు, రేడియేషన్, చంద్ర రాత్రుల్లో విద్యుత్ కొరత, భూమి నుంచి దూరం వంటి సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందుకే రోవర్లు, ల్యాండర్లు, డ్రోన్లు, విద్యుత్ వ్యవస్థలు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, నివాస మాడ్యూళ్లను దశలవారీగా చంద్రుడిపైకి పంపి వాటి పనితీరును పరీక్షించాలని నాసా భావిస్తోంది.మూన్ బేస్‌కు చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతాన్ని ఎంచుకోవడానికి ప్రధాన కారణం అక్కడి ప్రత్యేక భౌగోళిక పరిస్థితులు. శాశ్వతంగా నీడలో ఉండే కొన్ని ప్రాంతాల్లో నీటి మంచు ఉండే అవకాశం ఉంది. నీటిని భవిష్యత్‌లో తాగునీరు, ఆక్సిజన్, హైడ్రోజన్ వంటి వనరుల కోసం ఉపయోగించగలిగితే చంద్రుడిపై దీర్ఘకాలిక మానవ నివాసానికి అది కీలకంగా మారుతుంది.ఇక్కడే భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) పరిశోధనలు ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. చంద్రయాన్-2లోని పరికరం చంద్రుడి ధ్రువ ప్రాంతాలను రాడార్ ద్వారా అధ్యయనం చేసింది. 2026లో ఇస్రో వెల్లడించిన తాజా పరిశోధన ప్రకారం.. చంద్రుడి దక్షిణ ధ్రువంలోని కొన్ని శాశ్వత నీడ ప్రాంతాల్లోని నాలుగు క్రేటర్ల అడుగుభాగాల్లో ఉపరితలానికి దిగువన నీటి మంచు ఉండే అవకాశాన్ని రాడార్ పరిశీలనలు సూచించాయి. చంద్రయాన్-2 డేటా ఆధారంగా ఇస్రో శాస్త్రవేత్తలు చంద్రుడి ధ్రువ ప్రాంతాల్లో నీటి మంచు, ఉపరితల స్వభావం, ఇతర భౌతిక లక్షణాలకు సంబంధించిన కీలక డేటాను రూపొందించారు. భవిష్యత్ చంద్ర మిషన్ల ల్యాండింగ్ ప్రాంతాల ఎంపికకు ఈ సమాచారం ఉపయోగపడే అవకాశం ఉంది.నాసా ప్రణాళిక ప్రకారం తొలి దశలో రోవర్లు, ల్యాండర్లు, ఇతర రోబోటిక్ వ్యవస్థలు చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతాన్ని పరిశీలిస్తాయి. అనంతరం 2029 నుంచి సెమీ-పర్మినెంట్ మౌలిక సదుపాయాలు, విద్యుత్ వ్యవస్థలు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, నివాస సదుపాయాల ఏర్పాటు ప్రారంభమవుతుంది. ఈ దశలో భారీ మొత్తంలో కార్గోను చంద్రుడిపైకి పంపేందుకు అనేక ల్యాండర్ మిషన్లను ఉపయోగించనున్నారు2032 తర్వాతి దశలో మాత్రం లక్ష్యం మరింత పెద్దది. వ్యోమగాములు చంద్రుడిపై ఎక్కువకాలం నివసించి పనిచేసేలా సెమీ-పర్మినెంట్ హ్యాబిటేషన్ మాడ్యూళ్లు, దీర్ఘకాలిక విద్యుత్ వ్యవస్థలు, ప్రెషరైజ్డ్ రోవర్లు, నిరంతర సరఫరా వ్యవస్థలను ఏర్పాటు చేయాలని నాసా భావిస్తోంది. ఈ మూన్ బేస్ భవిష్యత్‌లో అంగారకుడి వంటి సుదూర గ్రహాల మిషన్లకు శిక్షణ, పరిశోధన, సాంకేతిక పరీక్షల కేంద్రంగా ఉపయోగపడే అవకాశం ఉంది.అయితే ఒక ముఖ్యమైన విషయాన్ని గమనించాలి. ప్రస్తుతం నాసా అధికారిక ప్రణాళికలో 2027లో ఆర్టెమిస్-3 ద్వారా నేరుగా చంద్రుడిపై మానవులు దిగడం కాకుండా, ఆ మిషన్‌ను భూమి కక్ష్యలో కీలక వ్యవస్థల పరీక్షలకు ఉపయోగించనున్నారు. చంద్రుడి దక్షిణ ధ్రువానికి తొలి ప్రణాళికాబద్ధమైన మానవ ల్యాండింగ్ ఆర్టెమిస్-4తో 2028లో జరగనుంది.చంద్రుడిపై మానవాళి దీర్ఘకాలిక ఉనికికి అడుగులు పడుతున్న వేళ.. ఇస్రో అందిస్తున్న చంద్ర ధ్రువ ప్రాంత డేటా, నీటి మంచిపై పరిశోధనలు, భవిష్యత్ చంద్ర మిషన్లకు భారత్ కీలక భాగస్వామిగా నిలిచే అవకాశాన్ని పెంచుతున్నాయి. చంద్రుడిపై మొదలయ్యే ఈ కొత్త అధ్యాయం.. చివరికి అంగారకుడిపై మనిషి అడుగుపెట్టే ప్రయాణానికి మరో పెద్ద మెట్టుగా మారనుంది.

# లోకల్ బాడీ ఎన్నికల ఫీవర్

**విజయవాడ, ఆగస్టు 18 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ లో మరో రెండు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలయ్యే అవకాశం ఉండటంతో రాజకీయ వాతావరణం క్రమంగా వేడెక్కుతోంది. గ్రామాలు, మండలాలు, పట్టణాల్లో ఇప్పటికే ఎన్నికల ఏర్పాట్లపై కసరత్తు జరుగుతోంది. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికలను ఏ విధానంలో నిర్వహించాలనే అంశం కూడా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఈవీఎంల కంటే బ్యాలెట్ పేపర్ విధానానికే ప్రాధాన్యం ఇవ్వాలనే ఆలోచన ముందుకు వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.స్థానిక ఎన్నికలకు అవసరమైన స్థాయిలో ఈవీఎంలు అందుబాటులో లేకపోవడం బ్యాలెట్ వైపు మొగ్గు చూపడానికి ప్రధాన కారణంగా చెబుతున్నారు. బ్యాలెట్ విధానంలో ఓటరు అభ్యర్థుల గుర్తులు, పేర్లను చూసి తనకు నచ్చిన వ్యక్తికి ఓటు వేయాల్సి ఉంటుంది. అందువల్ల అభ్యర్థి వ్యక్తిగత పరిచయం, గ్రామంలో చేసిన పని, స్థానిక సమస్యలపై అవగాహన వంటి అంశాలకు ప్రాధాన్యం పెరిగే అవకాశం ఉంటుంది. అయితే ఓటింగ్ విధానం ఒక్కటే ఎన్నికల ఫలితాలను నిర్ణయించదు. ప్రజల అభిప్రాయం, అభ్యర్థుల బలం, పార్టీ సంస్థాగత సామర్థ్యం, స్థానిక సమస్యలు వంటి అనేక అంశాలు ప్రభావం చూపుతాయి.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కి, తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమికి మధ్య పోటీపై ఆసక్తి నెలకొంది. బ్యాలెట్ విధానం తమకు అనుకూలంగా ఉంటుందని వైసీపీ వర్గాలు భావిస్తున్నట్లు రాజకీయ చర్చల్లో వినిపిస్తోంది. అయితే గ్రామస్థాయిలో ఓటర్లు తమ ప్రాంతానికి ఎవరు మెరుగైన సేవలు అందించగలరనే విషయాన్ని ప్రధానంగా పరిశీలించే అవకాశం ఉంది.కూటమి విషయానికి వస్తే సంక్షేమ కార్యక్రమాలతో పాటు అభివృద్ధి, పెట్టుబడులు, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలపై ప్రభుత్వం దృష్టి పెడుతోందనే ప్రచారం ఉంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీసుకుంటున్న నిర్ణయాలు కూడా స్థానిక రాజకీయాలపై ప్రభావం చూపవచ్చనే అంచనాలు ఉన్నాయి. టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య కూటమి సమన్వయం కూడా ఎన్నికల సమయంలో కీలకంగా మారవచ్చు.ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, సాగునీరు, విద్య, ఉపాధి వంటి స్థానిక అవసరాలపై ప్రజల దృష్టి ఉంటుంది. ప్రభుత్వం చేపట్టిన పనులు తమ ప్రాంతానికి ఎంతవరకు ఉపయోగపడ్డాయో ఓటర్లు అంచనా వేసే అవకాశం ఉంది. అదే సమయంలో స్థానిక అభ్యర్థుల వ్యక్తిగత ప్రతిష్ఠ కూడా కీలక పాత్ర పోషిస్తుంది. అందువల్ల బ్యాలెట్ విధానం అమలైతే ఒక పార్టీకి స్వయంచాలకంగా ప్రయోజనం కలుగుతుందని చెప్పడం కష్టం. ఎన్నికల ఫలితాలను నిర్ణయించేది చివరకు ప్రజల తీర్పే. గ్రామస్థాయిలో తమకు దగ్గరగా ఉన్న సమస్యలను ఎవరు పరిష్కరిస్తారనే అంశమే ఓటర్ల నిర్ణయంపై ఎక్కువ ప్రభావం చూపే అవకాశం ఉంది. దీంతో రాబోయే స్థానిక ఎన్నికలలో ఏ పార్టీ గెలుస్తుంది అన్న విషయం పై సర్వత్ర ఉత్కంఠత నెలకొంది..

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# ఆయన వృద్ధుడు..: అయోధ్య విరాళాల కేసులో షాకింగ్ పరిణామం



ఉత్తరప్రదేశ్‌లోని ప్రపంచ ప్రఖ్యాత అయోధ్య రామమందిరానికి భక్తులు సమర్పించిన విరాళాలను చోరీ చేసిన ఘటనలో శ్రీరామ జన్మభూమి ట్రస్టు మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ కు ఎలాంటి సంబంధం లేదని కేసును విచారించిన ప్రత్యేక దర్యాప్తు బృందం స్పష్టం చేసింది. ఆయన వృద్ధుడని పేర్కొనడం గమనార్హం. అంతేకాదు.. ఆయన నిరంతర రామభక్తుడని.. చోరీ వ్యవహారం కూడా ఆయనకు తెలియదని స్పష్టం చేసింది. ఆయనతో పాటు ట్రస్ట్ మాజీ సభ్యుడు అనిల్ మిశ్రాకు సైతం ఈ వ్యవహారంతో ఎలాంటి సంబంధం లేదని పేర్కొంది.అయోధ్య రామ మందిర విరాళాల చోరీ కేసులో ముమ్మర దర్యాప్తు చేసిన సిట్.. ఈ దర్యాప్తునకు సంబంధించిన తుది నివేదికను ఉత్తరప్రదేశ్ హోంశాఖకు అందించింది. అలానే.. శ్రీ రామ జన్మభూమి మందిర తీర్థ క్షేత్ర ట్రస్ట్ కు కూడా ఇచ్చింది. తదుపరి చర్యలు తీసుకునేందుకు వీలుగా పలు సిఫారసులు చేసింది. అయితే.. ట్రస్టు మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ సహా ట్రస్ట్ మాజీ సభ్యుడు అనిల్ మిశ్రాకు క్లీన్ చిట్ ఇవ్వడం వారికి ఎలాంటి సంబంధం లేదని పేర్కొనడం గమనార్హం.ఇక, విరాళాల చోరీకి సంబంధించి ఇప్పటికే 8 మంది జైల్లో ఉన్నారు. అసలు కీలక సూత్రధారిగా భావిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగికి ట్రస్టుతో ఎలాంటి సంబంధాలు ఉన్నాయి? ఆయనకు ఎవరు సహకరించారు. అనే కోణంలో దర్యాప్తు సాగింది. తొలినాళ్ల చంపత్‌రాయ్‌కు అన్నీ తెలుసునని పేర్కొన్న అధికారులు ఆయనకు.. చోరీ సూత్రధారికి మధ్య సంభాషణలు కూడా సాగాయని వివరించారు. కానీ, తాజా తుది నివేదికలో మాత్రం ఆయనను వృద్ధుడిగా పేర్కొనడమే కాకుండా..అసలు సంబంధం లేదని చెప్పడం గమనార్హం.ఐబాలరామయ్యకు సమర్పించిన వందల కోట్ల రూపాయల విరాళాల్లో పదుల కోట్ల రూపాయల సొమ్ము దారి మళ్లిందని అధికారులు తేల్చారు. సీసీటీవీల కన్ను కప్పి మరీ.. ఈ దోపిడీ సాగిందని వివరించారు. 100 నోట్లతో కట్ట కట్టాల్సిన చోట మరో 50 నోట్లను చేర్చి.. దారి మళ్లించినట్టు పేర్కొంది. అలాగే.. లోదుస్తులలో కూడా నగదును దాచుకుని తీసుకువెళ్లారని ఇది చాలా వారాల పాటు కొనసాగిందని ప్రత్యేక దర్యాప్తు అధికారులు వివరించారు. మరోవైపు ఈ కేసును సీబీఐకి అప్పగించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టాల్సి ఉంది.

# దేశంలోనే టాప్ 2.. రియల్ ఎస్టేట్‌లో భాగ్యనగరం దూకుడు



దేశీయ రియల్ ఎస్టేట్ రంగంలో హైదరాబాద్ నగరం తన జోరును మరింత పెంచుతోంది. ఐటీ, ఫార్మా, వ్యాపార రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్న భాగ్యనగరం.. తాజాగా దేశంలోనే రెండో అతిపెద్ద రియల్ ఎస్టేట్ మార్కెట్‌గా నిలిచింది. ప్రముఖ రియల్ ఎస్టేట్ డేటా అనలిటిక్స్ సంస్థ ప్రాప్‌ఈక్విటీ విడుదల చేసిన తాజా త్రైమాసిక నివేదికలో ఈ విషయం వెల్లడైంది. నూతన గృహాల సరఫరా, కొత్త ప్రాజెక్టుల ప్రారంభం విషయంలో బెంగళూరు తర్వాత హైదరాబాద్ రెండో స్థానాన్ని దక్కించుకుంది. గతంలో ఈ విభాగంలో ముందంజలో ఉన్న పుణే, థాణే, ఢిల్లీ-ఎన్‌సీఆర్ వంటి ప్రధాన నగరాలను హైదరాబాద్ అధిగమించడం విశేష అని అతం.

### కొత్త గృహాల సరఫరాలో భారీ వృద్ధి

ప్రాప్‌ఈక్విటీ నివేదిక ప్రకారం.. హైదరాబాద్‌లో నూతన గృహాల సరఫరా గతేడాదితో పోలిస్తే ఏకంగా 75 శాతం పెరిగింది. సమీక్షా కాలంలో నగరంలో 18,407 కొత్త నివాస యూనిట్లు మార్కెట్లోకి వచ్చాయి. 24,340 యూనిట్లతో బెంగళూరు మొదటి స్థానంలో ఉండగా.. హైదరాబాద్ 18,407 యూనిట్లతో రెండో స్థానాన్ని దక్కించుకుంది. నగరంలో బిల్డర్లు, రియల్ ఎస్టేట్ డెవలపర్లు భారీ స్థాయిలో కొత్త ప్రాజెక్టులను ప్రారంభించడం హైదరాబాద్ మార్కెట్‌పై పెరుగుతున్న నమ్మకానికి సంకేతంగా నిపుణులు భావిస్తున్నారు. ముఖ్యంగా పశ్చిమ హైదరాబాద్‌తో పాటు నగర శివారు ప్రాంతాల్లో నివాస, వాణిజ్య ప్రాజెక్టుల విస్తరణ కొనసాగుతోంది.

### అమ్మకాలలోనూ హైదరాబాద్ జోరు


కొత్త ప్రాజెక్టుల విషయంలోనే కాకుండా.. గృహాల విక్రయాల్లోనూ హైదరాబాద్ మంచి వృద్ధిని నమోదు చేసింది. సమీక్షా కాలంలో నగరంలో 14,410 నివాస గృహాలు విక్రయమయ్యాయి. ఇది గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 22 శాతం వృద్ధి కావడం గమనార్హం. ఐటీ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉన్నత ఆదాయ వర్గాలు, వ్యాపారవేత్తల నుంచి హైదరాబాద్‌లో ఇళ్లకు డిమాండ్ కొనసాగుతోంది. అదే సమయంలో నగరంలో మెరుగుపడుతున్న రహదారులు, మెట్రో విస్తరణ, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి కూడా రియల్ ఎస్టేట్ రంగానికి ఊతమిస్తున్నాయి. భవిష్యత్తులో నగర విస్తరణ మరింత పెరగనుండటంతో శివారు ప్రాంతాల్లోనూ స్థిరాస్తి కార్యకలాపాలు వేగం పుంజుకుంటున్నాయి.

### దేశవ్యాప్తంగా రియల్ ఎస్టేట్‌కు డిమాండ్

దేశంలోని ప్రధాన తొమ్మిది నగరాలను పరిశీలిస్తే.. కొత్త గృహాల సరఫరా మొత్తం 43 శాతం పెరిగి 1.17 లక్షల యూనిట్లకు చేరింది. ఇదే సమయంలో గృహాల విక్రయాలు 19 శాతం వృద్ధితో 1.12 లక్షల యూనిట్లుగా నమోదయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితులు కొనసాగుతున్నప్పటికీ భారత రియల్ ఎస్టేట్ మార్కెట్ మాత్రం బలమైన వృద్ధిని కొనసాగిస్తోందని ప్రాప్‌ఈక్విటీ గణాంకాలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా బెంగళూరు, హైదరాబాద్ వంటి దక్షిణ భారత నగరాలు ఈ వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. మొత్తంగా చూస్తే.. ఐటీ, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు, నగర విస్తరణ వంటి అంశాల కారణంగా హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ మరింత ఆకర్షణీయంగా మారుతోంది. కొత్త ప్రాజెక్టుల పెరుగుదలతో పాటు విక్రయాల్లోనూ స్థిరమైన వృద్ధి నమోదు కావడంతో భవిష్యత్తులో దేశంలోని అగ్ర రియల్ ఎస్టేట్ మార్కెట్లలో హైదరాబాద్ స్థానం మరింత బలపడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ఇద్దరు భారతీయులకు పాక్ అత్యున్నత పౌర పురస్కారం..! ఆ రహస్యం దాచినందుకే..

భారత్-పాకిస్థాన్ సరిహద్దుల మధ్య ఎప్పుడూ ఉద్రిక్తతలు, రాజకీయ విమర్శలు, సైనిక మోహరింపులే వార్తల్లో నిలుస్తుంటాయి. అయితే సుమారు ఎనిమిది దశాబ్దాల నాటి ఒక అరుదైన చారిత్రక ఘట్టం, వృత్తిపరమైన నిబద్ధత ప్రాతిపదికన భారత్‌కు చెందిన ఇద్దరు దివంగత పార్సీ వైద్యులకు పాకిస్థాన్ తమ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'నిషాన్-ఎ-ఇంతియాజ్'ను ప్రకటించింది. ఆ ఇద్దరు వైద్యులు బొంబాయికి చెందిన ఫిజిషియన్ డాక్టర్ జల్ రతన్ జీ పటేల్, రేడియాలజిస్ట్ డాక్టర్ జల్ ధేభో కూ.



### ఆ రహస్యం ఏమిటి? విభజనపై దాని ప్రభావం ఎంత?

1940ల కాలంలో భారత విభజన ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో పాకిస్థాన్ రూపశిల్పి మహ్మద్ అలీ జిన్నా తీవ్రమైన క్షయ వ్యాధి (టీబీ) తో బాధపడుతున్నారు. ఆ సమయంలో బొంబాయిలో జిన్నాకు వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్ జల్ రతన్ జీ పటేల్, డాక్టర్ జల్ ధేభో కూల ఎక్స్-రే నివేదికల్లో ఆయన ఊపిరితిత్తులు దెబ్బతిన్నాయని.. ఆయన ఆయుష్షు మరో ఏడెనిమిది నెలలు లేదా మహా అయితే ఏడాది-రెండేళ్లు మాత్రమేనని స్పష్టమైంది.అయితే, వైద్య వృత్తి నైతిక నియమావళి ప్రకారం రోగి ఆరోగ్య వివరాలను గోప్యంగా ఉంచాలన్న జిన్నా అభ్యర్థనకు ఆ వైద్యులు కట్టుబడ్డారు. జిన్నా ఆరోగ్య పరిస్థితిని బ్రిటిష్ అధికారులకు గానీ, నాటి కాంగ్రెస్ నాయకులైన మహాత్మా గాంధీ, జవాహర్‌లాల్ నెహ్రూలకు గానీ తెలియకుండా అత్యంత గోప్యంగా ఉంచారు.

ప్రసిద్ధ చరిత్రకారులు లారీ కాలిన్స్, డొమినిక్ లాపియర్ తమ ప్రతిష్టాత్మక పుస్తకం 'ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్' లో రాసిన దాని ప్రకారం.. అప్పటి చివరి వైస్రాయ్ లార్డ్ మౌంట్‌బాటెన్‌కు జిన్నా మరణిస్తారనే స్థితిలో ఉన్నారనే విషయం ముందే తెలిసి ఉంటే, విభజన ప్రక్రియను కొద్ది నెలలు వాయిదా వేసేవారని, ఫలితంగా అసలు పాకిస్థాన్ ఏర్పాటే అయ్యేది కాదని పేర్కొన్నారు.

### పాకిస్థాన్ ప్రభుత్వ గుర్తింపు

1947 ఆగస్టులో దేశ విభజన జరగగా దానికి సరిగ్గా ఏడాది తర్వాత అంటే 1948 సెప్టెంబర్ 11న జిన్నా మరణించారు. ఈ చారిత్రక ఘట్టం జరిగి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్న వేళ, పాకిస్థాన్ ప్రణాళికా రహిత అభివృద్ధి శాఖ మంత్రి అహ్సాన్ ఇక్బాల్ నేతృత్వంలోని అవార్డుల కమిటీ ఈ ఇద్దరు భారతీయ వైద్యుల నిబద్ధతను గుర్తించింది. "వృత్తిధర్మానికి కట్టుబడి వారు దాచిన ఆ రహస్యమే పాకిస్థాన్ అవతరణకు అత్యంత కీలకమైన వాతావరణాన్ని కల్పించింది" అని పేర్కొంటూ, మరణానంతరం వారికి 'నిషాన్-ఎ-ఇంతియాజ్' పురస్కారాన్ని ఇస్తున్నట్లు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. రాజకీయ సరిహద్దులు.. యుద్ధ వాతావరణం.. విభేదాలను పక్కన పెడితే.. వృత్తిపరమైన నిబద్ధతకు, వైద్య రంగ నైతికతకు ఇచ్చే గౌరవంగా ఈ ఘటన చరిత్ర పుటల్లో ప్రత్యేకంగా నిలిచిపోతుంది.

# పోరాట యోధుల కేటగిరీలో ఇద్దరికి ఎమ్మెల్సీ పదవులు.. టీడీపీలో వర్ల రామయ్య, రమాదేవి ప్రత్యేకం





గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా సీనియర్ నేత వర్ల రామయ్య, బీసీ మహిళా నేత దళవాయి రమాదేవి ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ ఇద్దరిని ఎమ్మెల్సీలుగా నియమించాలని సిఫార్సు చేస్తూ మంగళవారం నిర్వహించిన కేబినెట్ సమావేశంలో తీర్మానం చేశారు. రాజకీయ, ప్రాంతీయ, సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఇద్దరిని ఎంపిక చేశారని అంటున్నారు. కోస్తా జిల్లాల నుంచి ఎస్సీ కోటాలో వర్ల రామయ్య, రాయలసీమ నుంచి బీసీ, మహిళ కేటగిరీలో దళవాయి రమాదేవి పేర్లను ఎంపిక చేశారని చెబుతున్నా.. ఈ ఇద్దరికి ఒక విషయంలో సారూప్యం ఉందని వ్యాఖ్యానిస్తున్నారు.

ఎమ్మెల్సీల పదవులను పార్టీలో ఎందరో సీనియర్లు ఆశించినప్పటికీ అందరినీ విస్మయానికి గురిచేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న నిర్ణయం తీసుకున్నారని చెబుతున్నారు. సీనియర్ నేత వర్ల రామయ్య ఎంపిక ఊహించిందే అయినప్పటికీ ఎవరి అంచనాలకు అందని విధంగా బీసీ మహిళా కేటగిరిలో దళవాయి రమాదేవిని ఎంపిక చేయడంపైనే విస్తృత చర్చ జరుగుతోంది. ఈ ఇద్దరి ఎంపిక ద్వారా పార్టీ కోసం పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని సంకేతాలు ఇచ్చినట్లు చెబుతున్నారు. సహజంగా నామినేటెడ్ పదవులు, శాసనమండలి, రాజ్యసభ సభ్యుల ఎంపికలో ఆర్థిక బలం పనిచేస్తుందనే విమర్శలు వినిపిస్తుంటాయి. కానీ, వర్ల రామయ్య, దళవాయి రమాదేవి విషయంలో అటువంటి అభిప్రాయానికే తావివ్వలేదని వ్యాఖ్యానిస్తున్నారు.

### పార్టీకి అంకితమైన వర్ల రామయ్య

రిటైర్డ్ పోలీసు అధికారి అయిన వర్ల రామయ్య టీడీపీలో అంచెలంచెలుగా ఎదిగారు. రాయలసీమలోని అనంతపురంలో నిరుపేద ఎస్సీ కుటుంబంలో పుట్టిన వర్ల రామయ్య కష్టపడి పైకి వచ్చారని చెబుతున్నారు. డిగ్రీ చదువుకున్న ఆయన చాలాకాలం పోలీసు శాఖలో పనిచేశారు. 2009 ఎన్నికల ముందు టీడీపీలో చేరి తిరుపతి ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం నుంచి లోక్ సభకు పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ఓడిపోయారు. ఆ తర్వాత టీడీపీ అధికార ప్రతినిధిగా బలమైన గొంతు వినిపించారు. 2020లో గెలిచే అవకాశం లేదని తెలిసి రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసి పార్టీ ఆదేశాలు శిరసావహిస్తానని చాటుకున్నారు. 2014, 2019 ఎన్నికల్లో కూడా ఆయన ప్రత్యక్ష ఎన్నికల్లో అదృష్టం పరీక్షించుకున్నా విజయం దక్కలేదు. 2024లో ఆయన కుమారుడు పామర్రు నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2014లో ఆర్టీసీ చైర్మనుగాను పనిచేశారు. 2024 ఎన్నికల తర్వాత కూటమి తిరుగులేని ఆధిక్యంతో గెలవడంతో వర్ల రామయ్యకు నామినేటెడ్ పోస్టుపై పెద్ద ఎత్తున ఊహాగానాలు వినిపించాయి. రాజ్యసభ, శాసనమండలికి ఎప్పుడు ఎన్నిక జరిగినా ఆయన పేరు తెరపైకి వచ్చేది. కానీ, రకరకాల కారణాలతో ఇన్నాళ్లు వెనక్కి వెళ్లిపోయిన వర్ల రామయ్య పేరు ఈ సారి రెండో ఆలోచనకు తావివ్వకుండా ముందు వరుసలో నిల్చొందని అంటున్నారు. పార్టీ కోసం ఇన్నాళ్లు ఆయన చేసిన త్యాగాలకు గుర్తింపుగా ఆఖరి అవకాశంగా ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టారని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

### కార్పొరేటర్ గా ఓడినా ఎమ్మెల్సీగా గౌరవం

మరోవైపు వర్ల రామయ్యతోపాటు ఎమ్మెల్సీగా ఎంపికైన దళవాయి రమాదేవి చరిత్ర కూడా ఆసక్తి రేపుతోంది. సాధారణ కుటుంబ నేపథ్యం ఉన్న రమాదేవి ఎంపిక ద్వారా పార్టీ కోసం కష్టపడిన

వారికి ఇలాంటి గుర్తింపు ఉంటుందని టీడీపీ అధిష్టానం సంకేతాలు పంపిందని అంటున్నారు. 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అనంతపురం కార్పొరేషన్ లో 47వ డివిజన్ కార్పొరేటర్ గా రమాదేవి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ఓడిపోయినా పార్టీ కోసం అంకితభావంతో కష్టపడి పనిచేశారని అంటున్నారు. అనంతపురం లోక్ సభ నియోజకవర్గం పరిధిలో అంగన్ వాడీ విభాగం అధ్యక్షురాలిగా పనిచేసి గుర్తింపు తెచ్చుకున్నారు. గత ప్రభుత్వంలో సుమారు 6 కేసులు ఎదుర్కొన్న ఆమె పార్టీ తరఫున రాజీ లేకుండా పోరాడారని చెబుతున్నారు. దీనికి గుర్తింపుగా ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చినట్లు చెబుతున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ చెప్పినట్లుగా బూత్ స్థాయిలో పనిచేసినప్పటికీ పార్టీ గుర్తిస్తుందని రమాదేవి ఎంపిక నిరూపించిందని వ్యాఖ్యానిస్తున్నారు.

# డ్రంకెన్ డ్రైవ్ కేసులో డేవిడ్ వార్నర్ కు ఊహించని శిక్ష.. ఏడాది పాటు..

ఆస్ట్రేలియా క్రికెట్ దిగ్గజం, డాషింగ్ ఓపెనర్ డేవిడ్ వార్నర్ డ్రంకెన్ డ్రైవ్ కేసులో చిక్కుకొని వార్తల్లో నిలిచారు. మద్యం సేవించి వాహనం నడిపిన ఆరోపణలపై పట్టుబడిన ఆయనకు తీవ్రమైన శిక్ష పడుతుందని అందరూ భావించినప్పటికీ.. సిడ్నీ కోర్టు కీలక తీర్పుతో ఊరట లభించింది. గరిష్ఠంగా తొమ్మిది నెలల జైలు శిక్ష పడే అవకాశం ఉన్న ఈ తీవ్రమైన కేసులో వార్నర్‌కు జరిమానాతో పాటు కొన్ని కీలక షరతులతో న్యాయస్థానం నుంచి ఉపశమనం లభించింది.



### కేసు వివరాలు.. కోర్టు విచారణ

ఇటీవల సిడ్నీలో మద్యం సేవించి వాహనం నడుపుతూ ట్రాఫిక్ అధికారులకు దొరికిపోయిన వార్నర్‌పై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదైంది. ఆస్ట్రేలియాలో రహదారి భద్రతా నిబంధనలు అత్యంత కఠినంగా ఉంటాయి. మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉండటంతో అక్కడి అధికారులు, న్యాయస్థానాలు ఇలాంటి కేసులను అత్యంత తీవ్రంగా పరిగణిస్తాయి. చట్ట ప్రకారం ఈ తరహా నేరానికి గరిష్ఠంగా 9 నెలల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంటుంది.అయితే కేసు విచారణ సందర్భంగా వార్నర్ ప్రాథమికంగానే తన తప్పును న్యాయస్థానం ముందు అంగీకరించారు. విచారణ ప్రక్రియకు పూర్తిస్థాయిలో సహకరించడం, తన పొరపాటును ముందే ఒప్పుకోవడం వార్నర్‌కు అనుకూలమైన అంశాలుగా మారాయి. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్న సిడ్నీ కోర్టు, ఆయనకు జైలు శిక్ష విధించకుండా కేవలం జరిమానాతో కేసును ముగించింది.

### 1 లక్ష ఫైన్.. 12 నెలల కఠిన షరతు

సిడ్నీ కోర్టు డేవిడ్ వార్నర్‌కు 1,500 ఆస్ట్రేలియన్ డాలర్ల జరిమానా విధించింది. ఇది భారతీయ కరెన్సీలో సుమారు రూ. 1 లక్షకు సమానం. జరిమానాతో పాటు వార్నర్‌కు ఒక వినూత్నమైన, కఠినమైన షరతును కోర్టు విధించింది. రానున్న 12 నెలల (ఏడాది) పాటు ఆయన వాహనం డ్రైవింగ్ చేయాలంటే 'ఇగ్నిషన్ ఇంటర్‌లాక్' పరికరాన్ని తప్పనిసరిగా ఉపయోగించాలని ఆదేశించింది.

### ఇగ్నిషన్ ఇంటర్‌లాక్ అంటే ఏమిటి?

ఈ పరికరాన్ని వాహనంలోని ఇగ్నిషన్ సిస్టమ్‌కు అనుసంధానిస్తారు. డ్రైవర్ వాహనం స్టార్ట్ చేసే ముందు ఈ పరికరంలోకి ఊదాల్సి ఉంటుంది. డ్రైవర్ మద్యం సేవించలేదని పరికరం ధ్రువీకరించుకున్న తర్వాతే వాహనం ఇంజిన్ స్టార్ట్ అవుతుంది. ఒకవేళ ఆల్కహాల్ మోతాదు ఉన్నట్లు తేలితే వాహనం ఎంతకీ స్టార్ట్ కాదు.

### క్రికెట్ వీడ్కోలు తర్వాత మళ్లీ వార్తల్లో..

ఆస్ట్రేలియా క్రికెట్ చరిత్రలో అత్యంత విజయవంతమైన ఓపెనర్లలో ఒకరిగా పేరుగాంచిన వార్నర్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. ఐపీఎల్ తో పాటు అనేక ప్రపంచ టి20 లీగ్స్‌లో రాణిస్తున్న వార్నర్ ఈ డ్రంకెన్ డ్రైవ్ వ్యవహారంతో మళ్లీ వార్తల్లో నిలిచారు. నేరాన్ని అంగీకరించడం వల్ల జైలు శిక్ష ముప్పు నుంచి బయటపడినప్పటికీ కోర్టు విధించిన ఈ ఇగ్నిషన్ ఇంటర్‌లాక్ నిబంధన ఆయనకు గట్టి హెచ్చరిక లాంటిదేనని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు.

# మొక్కల మాయాజాలం!

అడవులను పునరుద్ధరించాలని పదేళ్ల క్రితం ప్రారంభించిన 'గ్రీన్ ఇండియా మిషన్' (జీఐఎం), తాను నిర్దేశించుకున్న లక్ష్యాల్లో దాదాపు ఏమీ సాధించలేకపోయిందని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) పనితీరు తనిఖీ స్పష్టం చేసింది. ఆగస్టు 13న పార్లమెంటుకు సమర్పించిన ఈ నివేదిక ప్రకారం, 2015-16 నుంచి 2024-25 వరకూ 16 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మిషన్ అమలును కాగ్ పరిశీలించింది. అటవీ విస్తీర్ణాన్ని 14 లక్షల హెక్టార్లలో పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంటే, వాస్తవంగా సాధించింది కేవలం 34,090 హెక్టార్లు మాత్రమే -లక్ష్యంలో 97.57 శాతం తక్కువ! అటవీ నాణ్యతను మెరుగుపరచడంలోనూ 91.87 శాతం లోటు కనిపించింది. కేవలం సంఖ్యాపరమైన వైఫల్యమే కాదు, నివేదిక చేసిన మరో కీలక వెల్లడి మరింత ఆందోళనకరం. క్షేత్రస్థాయిలో పరిశీలించిన నమూనా ప్రాంతాల్లో దాదాపు 70 శాతం చోట్ల మిషన్ వల్ల ఎలాంటి గుర్తించదగిన మార్పూ కనిపించలేదని జీఐఎస్ ఆధారిత మదింపులో తేలింది. ఫలితాలను ధృవీకరించడానికి వాడిన కేఎంఎల్ ఫైళ్లు సరిగ్గా పరిశీలించకపోవడం వల్ల, నివేదించిన సాధనలు అతిశయోక్తిగా చూపబడ్డాయని కూడా ఆడిట్ గుర్తించింది. పరిశ్రమల నుంచి అటవీ భూమి మళ్లింపు కోసం సేకరించే నిధులను నిర్వహించే కాంపా (సీఏఎంపీఏ), గ్రామీణ వేతన కూలీని మొక్కలు నాటే పనులకు వినియోగించే గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఇప్పుడు వీబీ-గ్రామ్‌జీగా పేరు మార్చుకుంది) వంటి పథకాలతో సమన్వయం చేసుకోవాలని జీఐఎం భావించినా, అది ఆచరణలో ఎన్నడూ సాకారం కాలేదు. సరిపడా నిధులు లేకపోవడం, పథకాల మధ్య బలహీన సమన్వయం, నాసిరకం పర్యవేక్షణ -ఇవే ఈ వైఫల్యానికి ప్రధాన కారణాలుగా కాగ్ గుర్తించింది.


2008లో ప్రకటించిన జాతీయ వాతావరణ మార్పు కార్యాచరణ ప్రణాళిక (నాప్‌సీసీ)లోని ఎనిమిది మిషన్లలో జీఐఎం ఒకటి. 2030 నాటికి అదనంగా 250 నుంచి 300 కోట్ల టన్నుల కార్బన్ సింక్‌ను సృష్టిస్తామని పారిస్ ఒప్పందానికి భారత్ ఇచ్చిన హామీని నెరవేర్చే సాధనంగా దీన్ని రూపొందించారు. జీవవైవిధ్యం, జలవనరులు, కార్బన్ సీక్వెస్ట్రేషన్, ఆవాసాల పునరుద్ధరణ వంటి పర్యావరణ లక్ష్యాలే దీని ప్రేరణ. అయితే, ఇప్పుడు ఈ మిషన్ నిర్లక్ష్యానికి గురై, 'ఏక్ పేడ్ మా కే నామ్' (అమ్మ పేరిట ఒక మొక్క) పేరుతో 2024లో ప్రారంభమైన మొక్కలు నాటే కార్యక్రమం దాని స్థానాన్ని ఆచరణాత్మకంగా ఆక్రమించినట్టు కనిపిస్తోంది. ఇప్పటివరకూ 140 కోట్ల మొక్కలు నాటినట్టు ప్రభుత్వం ప్రకటించినా, తాజా అటవీ గణాంకాలు 'చెట్టు'కు, 'అడవి'కి మధ్య ఉన్న అగాధాన్ని బహిర్గతం చేస్తున్నాయి. ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ రిపోర్ట్ 2023 ప్రకారం, పచ్చదనం 1,445 చదరపు కిలోమీటర్లు పెరిగినా, అందులో నిజమైన అడవి కేవలం 156 చదరపు కిలోమీటర్లు మాత్రమే. మిగతా 1,289 చదరపు కిలోమీటర్లు 'నమోదిత అడవుల వెలుపలి చెట్ల కవర్' మాత్రమే.

నమోదిత అడవుల్లోనే దట్టమైన కేనోపీ క్రమంగా పొదలుగా క్షీణిస్తోంది. అంటే, భారత్ ఎక్కువగా మొక్కలు నాటుతోంది, తక్కువగా అడవులను పెంచుతోంది. ఆసక్తికరంగా, జీఐఎం నిధుల వినియోగం కూడా 2020-21 నుంచి నిరంతరం తక్కువగానే ఉంటూ వచ్చింది. 2025-26కు కేటాయించిన నిధుల్లో కేవలం 28 శాతం మాత్రమే వినియోగించగా, 2026-27కు కేటాయించిన మొత్తం కేవలం రూ.170 కోట్లకే పరిమితమైంది, ఇది మిషన్ ప్రాధాన్యతను ప్రభుత్వం ఎంత తగ్గించిందో స్పష్టం చేస్తోన్న అంశం.

ఈ సంక్షోభాన్ని అత్యంత స్పష్టంగా ప్రతిబింబించే ఉదాహరణ అరావళి పర్వతశ్రేణి వివాదం! దేశంలోనే అత్యంత క్షీణించిన శ్రేణిగా చెప్పదగిన అరావళిలో, గుట్టలు క్వారీయింగ్‌తో కరిగిపోగా, స్థానిక వృక్షజాలాన్ని ఆక్రమణదారు జాతి 'విలాయతీ కికర్' (ప్రొసోపిస్ జులిఫ్లోరా) కమ్మేసింది. ఇప్పుడు దీన్ని 'గ్రీన్ వాల్' పేరుతో కొత్త మొక్కలు నాటడం ద్వారా రక్షించాలని ప్రయత్నిస్తున్నారు. కానీ, ఏళ్ల తరబడి సాగిన మైనింగ్ విధ్వంసాన్ని, ఆక్రమణలను, వేల సంవత్సరాలు పట్టి ఏర్పడిన పర్యావరణ వ్యవస్థను ఈ కొత్తగా నాటిన మొక్కలు తిరిగి తీసుకురాలేవు. పునరుద్ధరణ అంటే ల్యాండ్‌స్కేపింగ్ కాదు. అయితే, ఈ నివేదికను ఎలా చదవాలన్న దానిపైనా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగ్ సాధనం అకౌంటింగ్ మాత్రమే. అది హెక్టార్లను, రూపాయలను లెక్కించగలదే తప్ప, సజీవ అడవి విలువను కొలవలేదని, మిషన్ అమలులో ఎదురయ్యే ఆచరణాత్మక సవాళ్లను ఎల్లప్పుడూ పూర్తిగా బంధించలేదని కొందరు వాదిస్తున్నారు. 2019-20 నుంచి 2023-24 మధ్య కాంపా కింద రూ.38,516 కోట్లు రాష్ట్రాలకు ఆమోదం పొందగా, అందులో రూ.26,001 కోట్లు వినియోగించినట్టు గణాంకాలు చూపుతున్నాయని, జీఐఎంను వ్యాపక అటవీకరణ కార్యక్రమాల మొత్తం సందర్భంలో చూడాలని, ప్రక్రియాపరమైన వైఫల్యాలకు, ఫలిత వైఫల్యాలకు మధ్య తేడా గుర్తించాలని, ఆడిట్ నివేదిక సమర్పణకు ఏడాది ముందే ప్రభుత్వం సవరించిన రోడ్‌మ్యాప్‌ను ప్రకటించిందని కొందరు విశ్లేషకులు ఎత్తిచూపుతున్నారు. అయినప్పటికీ, కాగ్ తీర్పు తన బరువును కోల్పోదు. భారత్ అడవులను పునరుద్ధరించే మిషన్‌ను నీరసించనిస్తూ, ప్రభుత్వం మాత్రం చెట్లను లెక్కించడంలోనే బిజీగా ఉండటం, జాతీయ వాతావరణ లక్ష్యాలపైనే కాకుండా, పర్యావరణ పరిరక్షణపై విధాన నిబద్ధతపైనే తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తుతోంది. కేవలం మొక్కలు నాటడం మాత్రమే సరిపోదు, నాటిన ప్రతి మొక్క ఎదిగి, జీవవైవిధ్యంతో కూడిన సజీవ అటవీ వ్యవస్థగా రూపాంతరం చెందేలా దీర్ఘకాలిక సంరక్షణ, పర్యవేక్షణ, జవాబుదారీతనం అవసరమని ఈ నివేదిక గట్టిగా గుర్తుచేస్తోంది.

అడవి అంటే కేవలం భూమిపై నాటిన మొక్కల సంఖ్య కాదు. అది వృక్షాలు, జంతువులు, నేల, జలవనరులు కలిసి ఏర్పరచుకునే ఒక సజీవ వ్యవస్థ. ఈ వ్యత్యాసాన్ని గుర్తించకుండా, కేవలం మొక్కలు నాటిన సంఖ్యనే విజయ గీటురాయిగా చూపుతూ ముందుకు సాగితే, భారత్ తన వాతావరణ లక్ష్యాలను కాగితాలపై చేరుకున్నా, వాస్తవంలో అడవుల కోల్పోతున్న జీవవైవిధ్యాన్ని, పర్యావరణ సమతుల్యతను తిరిగి పొందలేకపోవచ్చు. దీర్ఘకాలిక సంరక్షణ, జవాబుదారీతనంతో కూడిన నిజమైన అటవీ పునరుద్ధరణ దిశగా ప్రభుత్వం తక్షణం దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది!!

## పనికొచ్చే పలుకు



# క్షమాగుణాన్ని మించినదేది!?

మనిషి జీవితంలో ఎదురయ్యే అనేక సవాళ్లలో అత్యంత కష్టతరమైనది -తనకు హాని చేసినవారిని క్షమించడం! ఇది కేవలం నైతిక ఉపదేశం కాదు.. జీవన శైలిని సమూలంగా మార్చే గొప్ప సూత్రం. సుమతీ శతకకారుడు బద్దెన ఈ ప్రాపంచిక సత్యాన్ని ఎంతో అందంగా ఇలా చెప్పాడు:

**"ఉపకారికి నుపకారము/ విపరీతము గాదు సేయ వివరింపంగా,
అపకారికి నుపకారము/ నెపమెన్నక సేయువాడు నేర్పరి సుమతీ!"**

మనకు మేలు చేసినవారికి తిరిగి మేలు చేయడం సహజం. ఇందులో గొప్పతనమేమీ లేదు. ఇది ప్రతి మనిషిలోనూ సహజంగా ఉండే స్పందన. కానీ నిజమైన మనోబలం, నిజమైన నేర్పు అనేవి బయటపడేది తనకు కీడు చేసినవారిపట్ల మనం ఎలా ప్రవర్తిస్తామన్న దానిలోనే. గతంలో వారు చేసిన తప్పులను గుర్తు చేస్తూ, పగతో రగిలిపోతూ బతకడం సులభమే. కానీ ఆ తప్పులను పక్కనపెట్టి, ద్వేషాన్ని విడనాడి, అవసరమైతే వారికి సహాయం చేయగలిగే మనస్తత్వం అలవర్చుకోవడమే అసలైన జీవన కళ.

ఈ ఆలోచనను నేటి జీవనశైలికి అన్వయించుకుంటే, దీని విలువ మరింత స్పష్టమవుతుంది. మనం రోజువారీ జీవితంలో ఎంతోమందితో సంబంధాలు కొనసాగిస్తుంటాం... కుటుంబంలో, స్నేహితుల మధ్య, కార్యాలయంలో. ఈ సంబంధాల్లో అపార్థాలు, గొడవలు, నొప్పించే మాటలు సహజం. అయితే వీటిని మనసులో పెట్టుకుని, ప్రతీకారేచ్ఛతో బతకడం మొదలుపెడితే, అది మనల్ని లోలోపల కుంగదీస్తుంది. మానసిక ఆరోగ్యంపై దీని ప్రభావం అపారం. ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమివంటి సమస్యలకు మూలకారణంగా తరచూ కనిపించేది ఈ అణిచిపెట్టిన కోపమే. దీనికి విరుగుడు క్షమాగుణమే. ఎవరైనా మనల్ని నొప్పించినా, వారి తప్పులను పదేపదే గుర్తుచేసుకోకుండా ముందుకు సాగగలిగితే, మనసు తేలికవుతుంది. ఇది బలహీనత కాదు -అసలైన శక్తి. ఎందుకంటే క్షమించడానికి ధైర్యం కావాలి, సహనం కావాలి, ఔన్నత్యం కావాలి!

ఈ సూత్రాన్ని వృత్తిపరమైన జీవితంలోకి తీసుకువస్తే కూడా దాని ప్రయోజనం స్పష్టమవుతుంది. తోటి ఉద్యోగి ఒకసారి తప్పు చేసినా, అతనితో శత్రుత్వం పెంచుకోకుండా సహకరించే మనస్తత్వం ఉన్నవారే బృందంలో నిజమైన నాయకులుగా ఎదుగుతారు. కుటుంబ సంబంధాల్లో కూడా, భార్యాభర్తల మధ్య, తల్లిదండ్రులు-పిల్లల మధ్య చిన్న చిన్న అపార్థాలు వచ్చినప్పుడు, పాత తప్పులను తిరిగి తిరిగి ప్రస్తావించకుండా ముందుకు సాగే గుణం ఆ బంధాలను బలపరుస్తుంది. దీనికి విరుద్ధంగా, ప్రతి చిన్న విషయాన్ని లెక్కపెడుతూ, పాత గాయాలను రేపుతూ ఉంటే, ఎంత బలమైన బంధమైనా చివరికి బీటలువారుతుంది.

ఈ పద్యంలోని మరో సూక్ష్మమైన అంశం ఏమిటంటే.. -"నెపమెన్నక" అనే పదం. అంటే, ఉపకారం చేసేటప్పుడు కూడా ఆ వ్యక్తి గతంలో చేసిన తప్పులను ఎత్తిచూపకుండా చేయాలన్నది. కేవలం క్షమించడమే కాదు, ఆ క్షమను గొప్పగా చాటుకోకుండా, సహజంగా, నిష్కల్మషంగా ఆచరించడమే అసలైన ఔన్నత్యం. ఎందుకంటే క్షమించి కూడా ఆ విషయాన్ని పదేపదే గుర్తుచేస్తూ ఉంటే, అది నిజమైన క్షమ కాదు -అది మరో రూపంలో ఉన్న అహంకారమే.

జీవితంలో ప్రశాంతత, సంతోషం కోరుకునే ప్రతి ఒక్కరూ ఈ సూత్రాన్ని ఆచరించి చూడాలి. ఇతరుల తప్పులను క్షమించడం వల్ల మనకు కలిగే మానసిక ప్రశాంతతే అంతిమంగా మన జీవన నాణ్యతను నిర్ణయిస్తుంది. కీడుకు ప్రతీకారంతో బదులివ్వడంకంటే, మేలుతో స్పందించడమే నిజమైన బలం, నిజమైన సంస్కారం అని సుమతీ శతకకారుడు శతాబ్దాల క్రితమే మనకు బోధించారు. నేటికీ ఆ మాట అంతే వర్తిస్తుంది, అంతే విలువైనది!

# రెక్కలల్లార్చిన భోగాపురం!


ఉత్తర ఆంధ్రప్రదేశ్ విమానయాన చరిత్రలో సోమవారం నూతన అధ్యాయం ఆరంభమైంది. భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం వాణిజ్య సర్వీసులు ప్రారంభించిన తొలిరోజే ఏకంగా 52 విమాన రాకపోకలతో సందడి నెలకొంది. ఆగస్టు 1న ప్రధాని మోదీ ప్రారంభించిన ఈ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని జీఎంఆర్ సంస్థ అభివృద్ధి చేసి నిర్వహిస్తోంది. హైదరాబాద్ నుంచి ఇండిగో తొలి విమానం రాగా, అబుధాబి, సింగపూర్ నుంచి అంతర్జాతీయ సర్వీసులు కూడా మొదలయ్యాయి. ప్రపంచంలోనే అతిపెద్ద ఎంఆర్‌వో సదుపాయం, భారీ కార్గో టెర్మినల్, ఏరోసిటీ వంటి ప్రణాళికలతో భోగాపురం భవిష్యత్తులో తూర్పు తీరపు ఏరోస్పేస్ కేంద్రంగా ఎదిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. దశాబ్దానికిపైగా చంద్రబాబు నాయుడు ఊహించిన ఈ దార్శనికత, ఇప్పుడు ఉత్తరాంధ్ర ఆర్థిక వ్యవస్థనే పునర్నిర్వచించే దిశగా అడుగులేస్తోంది.



ఉత్తర ఆంధ్రప్రదేశ్ విమానయాన చరిత్రలో ఒక నూతన అధ్యాయం ఆరంభమైంది. భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం అధికారికంగా వాణిజ్య సర్వీసులను ప్రారంభించిన తొలిరోజే ఏకంగా 52 విమాన రాకపోకలతో సందడి నెలకొంది. దేశీయ ప్రధాన కేంద్రాలతోపాటు మధ్యప్రాచ్యం, ఆగ్నేయాసియా అంతర్జాతీయ గమ్యస్థానాలకూ కొత్త గేట్‌వే అనుసంధానతను అందించింది. ఆగస్టు 1న ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన ఈ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జీవీఐఏఎల్) అభివృద్ధి చేసి నిర్వహిస్తోంది. "భోగాపురంలో విమానాశ్రయం ప్రారంభం ఆంధ్రప్రదేశ్‌కు అనుసంధానతలో చారిత్రక శకానికి తెరతీస్తోంది. యువత ఆకాంక్షలకు బలం చేకూర్చి, విస్తృత ఆర్థిక అవకాశాలను తెరుస్తోంది" అని సీఎం చంద్రబాబు నాయుడు 'ఎక్స్'లో పోస్టు చేశారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్వయంగా ప్రయాణికులకు బోర్డింగ్ పాస్‌లు, జ్ఞాపికలు అందజేస్తూ ఈ చారిత్రక ఘట్టానికి ప్రాధాన్యతను చేకూర్చారు. ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఇండిగో, స్కూట్, ఇండియావన్ సంస్థల విమానాలు తొలిరోజు సాంప్రదాయ వాటర్ కెనన్ సెల్యూట్‌తో స్వాగతం పొందాయి. హైదరాబాద్ నుంచి బయలుదేరిన ఇండిగో 6ఈ 6408 విమానం తొలి రాకగా చరిత్రకెక్కగా, అబుధాబి నుంచి 6ఈ 1443 విమానం రాకతో అంతర్జాతీయ కార్యకలాపాలు కూడా మొదలయ్యాయి. సింగపూర్ నుంచి స్కూట్ టీఆర్ 784 విమానం దిగడం, భోగాపురం తొలిరోజు నుంచే గ్లోబల్ కనెక్టివిటీని అందుకున్న సూచనగా నిలిచింది.

కేవలం తొలిరోజు గణాంకాలే కాదు, భోగాపురం భవిష్యత్తు సామర్థ్యాన్ని పరిశీలిస్తే ఇది సమీప కాలంలోనే తన లక్ష్యాలను మించి ఎదిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 2,200 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ విమానాశ్రయం, బోయింగ్ 777, 787 డ్రీమ్‌లైనర్, ఎయిర్‌బస్ ఏ330, ఏ350 వంటి వైడ్-బాడీ విమానాలను నిర్వహించగల 3,800 మీటర్ల కోడ్-4ఈ రన్‌వేను కలిగి ఉంది. ప్రస్తుతం వార్షికంగా 60 లక్షల మంది ప్రయాణికులను నిర్వహించే సామర్థ్యంతో ప్రారంభమైనా, భవిష్యత్తులో 4 కోట్లమందికి పైగా విస్తరించే ప్రణాళిక ఇప్పటికే సిద్ధంగా ఉంది. అంతకుమించి, ఈ ప్రాజెక్టులో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన అంశం -500 ఎకరాల ఏవియేషన్ హబ్‌లో భాగంగా 25 ఎకరాల్లో ప్రపంచంలోనే అతిపెద్ద మెయింటెనెన్స్, రిపేర్ అండ్ ఓవర్‌హాల్ (ఎంఆర్‌వో) సదుపాయాన్ని నిర్మించాలన్న ప్రణాళిక. ఇది సాకారమైతే, తూర్పు తీరంలో భోగాపురం ఏరోస్పేస్ కేంద్రంగా మారి, అంతర్జాతీయ విమానయాన, రక్షణ తయారీ సంస్థలను ఆకర్షించే అవకాశం ఉంది. అంతేకాక, 25,000 మెట్రిక్ టన్నుల వార్షిక సామర్థ్యంగల కార్గో టెర్మినల్, ఔషధాలు, సముద్ర ఉత్పత్తులువంటి అధిక విలువ కలిగిన నశ్వర వస్తువుల కోసం ప్రత్యేక కోల్డ్ చైన్ సదుపాయాలనూ అభివృద్ధి చేస్తున్నారు. విశాఖపట్నం పోర్టు, పారిశ్రామిక కారిడార్లతో అనుసంధానం చేయడం ద్వారా, భోగాపురాన్ని తూర్పు తీరంలో ప్రధాన ఎయిర్ కార్గో, లాజిస్టిక్స్ కేంద్రంగా తీర్చిదిద్దాలన్నది లక్ష్యం. ఇండియాలోనే అత్యంత వేగంగా పూర్తయిన గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాల్లో ఇది ఒకటి. కేవలం 31 నెలల్లో, నిర్దేశిత గడువుకన్నా ఐదు నెలలు ముందుగానే పూర్తి కావడం విశేషం. ఏవియేషన్ యూనివర్సిటీ, ఎడ్యుసిటీ, ఏరోసిటీ వంటి అనుబంధ ప్రాజెక్టులు కూడా సమాంతరంగా రూపుదిద్దుకుంటున్నాయి. ఇవి కేవలం విమానాశ్రయాన్ని దాటి, మొత్తం విశాఖపట్నం-భోగాపురం గ్రోత్ కారిడార్‌ను దేశంలోనే అగ్రగామి ఆర్థిక, పారిశ్రామిక కారిడార్లలో ఒకటిగా మార్చాలన్న విస్తృత దార్శనికతను ప్రతిబింబిస్తున్నాయి.

అయితే, ఇంతటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు ప్రారంభ దశలో సహజంగానే కొన్ని సవాళ్లు ఎదురవుతున్నాయి. సిరిపురానికి చెందిన ఒక ప్యాసింజర్ తన అనుభవాన్ని పంచుకుంటూ, తెల్లవారుజామునే బయలుదేరిన తన ప్రయాణంలో ఆనందపురం జంక్షన్ వద్ద తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని, విమానాశ్రయంలోకి అడుగుపెట్టిన తర్వాత అద్భుతంగా ఉండి, సుదీర్ఘ ప్రయాణాన్ని భర్తీ చేసిందని పేర్కొన్నారు. నగరం నుంచి శివారు ప్రాంతంలోని ఈ కొత్త విమానాశ్రయానికి మధ్య దూరాన్ని తగ్గించేందుకు ఏపీఎస్ఆర్టీసీ ఇప్పటికే 'ఏరో ఎక్స్‌ప్రెస్' పేరుతో ఏసీ ఎలక్ట్రిక్ బస్సు సర్వీసులను ప్రారంభించింది. తొలిరోజే 14 ఈ-బస్సులు రెండు ప్రధాన మార్గాల్లో ఉదయం 4:30 నుంచి రాత్రి 10:30 వరకు నడుస్తున్నాయి. ఇలాంటి అనుసంధాన సవాళ్లను ముందుచూపుతో పరిష్కరిస్తున్న తీరు, ప్రభుత్వం, జీఎంఆర్ సంస్థ కేవలం విమానాశ్రయాన్ని నిర్మించడమే కాకుండా, ప్రయాణికుల అనుభవాన్ని సమగ్రంగా మెరుగుపరచడంపైనా దృష్టి సారించాయని స్పష్టం చేస్తుంది. 2014లో రాష్ట్ర విభజన అనంతరం హైదరాబాద్ అనే ప్రధాన విమానయాన కేంద్రాన్ని కోల్పోయిన ఆంధ్రప్రదేశ్‌కు, ఇన్ని ఏళ్ల తర్వాత తనదైన పూర్తిస్థాయి అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం లభించడం విభజనానంతర ప్రయాణంలో ఒక నిర్ణయాత్మక మలుపు! దశాబ్దానికిపైగా చంద్రబాబు నాయుడు ఊహించిన ఈ దార్శనికత, ఇప్పుడు వాస్తవ రూపం దాల్చడం యాదృచ్ఛికం కాదు. ఇది స్థిరమైన ప్రణాళిక, సకాలంలో అమలు ఫలితమే. తొలిరోజు 52 సర్వీసులతో మొదలైన ఈ ప్రయాణం, భవిష్యత్తులో ఎంఆర్‌వో, కార్గో, ఏరోసిటీ, ఏవియేషన్ యూనివర్సిటీ వంటి అనుబంధ ప్రాజెక్టులు పూర్తయ్యే కొద్దీ, కేవలం ఒక విమానాశ్రయంగా కాకుండా యావత్ ఉత్తర ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థనే పునర్నిర్వచించే శక్తిమంతమైన చోదకశక్తిగా ఎదగనుందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. ■




స్నేహం అంటే గొప్ప మాటలు కాదు -కలిసి నవ్విన క్షణాలు, పంచుకున్న చిన్న ఆనందాలు. రోజువారీ జీవితంలో మనం పెద్ద విషయాల వెంట పరిగెడుతూ, చిన్న చిన్న ఆనందాలను మర్చిపోతుంటాం. కానీ నిజానికి, హృదయానికి నిజమైన విశ్రాంతి దొరికేది ఆ చిన్న క్షణాల్లోనే.. ఒక స్నేహితుడితో పంచుకున్న నవ్వులో, ఓ చిన్న మాటలో, ఓ చిరు జ్ఞాపకంలో. అలాంటి క్షణాలే మనసుకు కొత్త ఉదయాన్ని, కొత్త శక్తిని ఇస్తాయి. అందుకే స్నేహాన్ని, దాంట్లోని చిన్న ఆనందాలను జీవితంలో ఎప్పుడూ కాపాడుకోవాలి.

-మహాదేవ

## వింతల్లో వింతలు

# హిమక్రీము.. రుచే వేరు!



జపాన్‌లో ఐస్‌క్రీమ్ ప్రియులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది ఒక వింత రుచి. ఇవాటే ప్రిఫెక్చర్‌లోని 'మిచినో-ఏకి యామడ' అనే రోడ్‌సైడ్ డైనర్, గుల్లలతో తయారు చేసిన సాఫ్ట్-సర్వ్ ఐస్‌క్రీమ్‌తో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. యామడ బే నుంచి తీసుకొచ్చిన తాజా సముద్ర గుల్లలను, మృదువైన పాల ఐస్‌క్రీమ్‌పై అలంకరించి, పైన సోయా సాస్ చిలకరించి వడ్డిస్తున్నారు. "సముద్ర తాజాదనం -తీపి పాలు -ఉప్పటి సోయా సాస్" కలయిక రుచి మొగ్గలను షాక్‌కు గురిచేస్తుందని రుచి చూసినవారు చెబుతున్నారు. ఈ వింత డెజర్ట్ ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తుండగా, "ఇది ఏఐ సృష్టేమో" అని కొందరు నెటిజన్లు నమ్మలేకపోతున్నారు. కేవలం 600 యెన్ (సుమారు రూ.300)కే లభించే ఈ వింత కోన్‌ను ఈ వేసవి అంతా అందించనున్నట్టు యాజమాన్యం తెలిపింది. ఇప్పటికే మాచా, రామెన్ సాఫ్ట్-సర్వ్ వంటి వింత రుచులతో పేరున్న జపాన్, ఇప్పుడు ఈ గుల్ల ఐస్‌క్రీమ్‌తో మరోసారి ఆసక్తి రేపుతోంది.

# ఈ ఆహారాలు తింటే రోగనిరోధక శక్తి డబుల్

మన శరీరంలో రెండో మెదడు ఎక్కడ ఉంటుందో తెలుసా? అది మన పొట్ట. పొట్ట ఆరోగ్యంగా ఉంటేనే మన మూడ్ బాగుంటుంది. అన్ని పనులు సజావుగా చేయడానికి శరీరం కూడా సహకరిస్తుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. చివరికి చర్మం కూడా కాంతివంతంగా మెరుస్తుంది. కానీ ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలు ప్రతి ఒక్కరినీ వేధిస్తున్నాయి. వీటన్నింటికీ ప్రధాన కారణం మనం తీసుకునే ఆహారంలో ఒక ముఖ్యమైన అంశం తగ్గిపోవడమే. అదే 'ఫైబర్' (పీచు పదార్థం). ప్రముఖ గ్యాస్ట్రో స్పెషలిస్ట్ డాక్టర్ పాల్, మన వంటింట్లో దొరికే సాధారణ పదార్థాలతోనే పొట్టను ఎలా క్లీన్ చేసుకోవచ్చో వివరించారు. ఆయన సూచించిన ఆ ఐదు సూపర్ ఫుడ్స్ ఏంటి? ఫైబర్ అనేది జీర్ణవ్యవస్థకు ఒక క్లీనర్ లాగా పనిచేస్తుంది. ఇది మనం తిన్న ఆహారం సాఫీగా కదలడానికి సహాయపడటమే కాకుండా, మన పొట్టలో ఉండే మంచి బ్యాక్టీరియాకు ఆహారాన్ని అందిస్తుంది. ఫైబర్ అందించడంలో వేయించిన శనగలు అగ్రస్థానంలో నిలుస్తాయి. ప్రతి 100 గ్రాముల శనగలలో సుమారు 17 గ్రాముల ఫైబర్ ఉంటుంది. ఇందులో ఉండే ఇన్‌సోల్యూబుల్ ఫైబర్, ప్రోటీన్ మిమ్మల్ని ఎక్కువ సేపు ఆకలి వేయకుండా ఉంచుతాయి. వీటిని చిరుతిండిగా నేరుగా తీసుకోవచ్చు లేదా సలాడ్లలో కలుపుకోవచ్చు. మన ఇళ్లలో సాధారణంగా వాడే నల్ల మినుములలో ఒక కప్పుకు 16 గ్రాముల ఫైబర్ లభిస్తుంది. ఇందులో కరిగే, కరగని ఫైబర్స్ రెండూ ఉంటాయి. ఇవి జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా, మన పొట్టలోని మంచి బ్యాక్టీరియాను పోషిస్తాయి. పప్పు మఖానీ లేదా అన్నంలో కలిపి తీసుకోవడం వల్ల గుండెకు కూడా మేలు



జరుగుతుంది. చియా విత్తనాలు ఇప్పుడు సూపర్ ఫుడ్‌గా ప్రాచుర్యం పొందాయి. కేవలం రెండు టేబుల్ స్పూన్ల చియా విత్తనాల్లో 10 గ్రాముల ఫైబర్ ఉంటుంది. ఇవి పొట్టలోకి వెళ్ళగానే జెల్ లాగా మారి జీర్ణక్రియను సులభతరం చేస్తాయి. బ్లడ్ షుగర్ లెవల్స్ స్థిరంగా ఉండటానికి కూడా ఇవి తోడ్పడతాయి. డాక్టర్ పాల్ వీటిని పెరుగుతో కలిపి తీసుకోవాలని సూచిస్తున్నారు. చూడటానికి చాలా చిన్నవిగా ఉన్నా, రాస్ప్‌బెర్రీస్ ఫైబర్ పవర్‌హౌస్‌లు. ఒక కప్పు రాస్ప్‌బెర్రీస్‌లో 8 గ్రాముల ఫైబర్ లభిస్తుంది. ఇవి మంచి బ్యాక్టీరియాకు మద్దతు ఇవ్వడమే కాకుండా, శరీరానికి కావాల్సిన యాంటీ ఆక్సిడెంట్లను అందిస్తాయి. వీటిని స్మూతీలలో లేదా ఓట్స్‌లో కలిపి తీసుకోవచ్చు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆరోగ్యాన్ని ఇచ్చే పండు జామ. ఇందులో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. మలబద్ధకంతో బాధపడేవారికి ఇది ఒక దివ్యౌషధంలా పనిచేస్తుంది. రోజూ

ఒక జామ పండు తినడం వల్ల జీర్ణవ్యవస్థ మొత్తం శు భ్రపడుతుంది. ఆరోగ్యకరమైన పొట్టే సంతోషకరమైన జీవితానికి ఆధారం. డాక్టర్ పాల్ సూచించిన ఈ ఐదు పదార్థాలను మీ రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల జీర్ణ సమస్యల నుండి శాశ్వత ఉపశమనం పొందవచ్చు. ఇవి కేవలం మీ పొట్టనే కాకుండా, మీ పూర్తి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.

# జీవితం అంటే సినిమా కాదు. యువత ఆలోచన చేయండి

నిజజీవితం అంటో రెండున్నరగంటల సినిమా కాదు... అన్నీ మారిపోయి శుభం కార్డు పడడానికి

సమాజంలో జరిగే కొన్ని విషయాలలో ప్రజలను చైతన్య పరిచేందుకు నిజ జీవితంలో జరిగిన కథ, కథనలతో సినిమాలుగా మలిసి

సమాజంలో చిత్ర ప్రదర్శనకు ఏర్పాటు చేస్తారు.దాని వల్ల కొంతమందైన చైతన్యంచెంది జీవితంలో బాగుపడుతారు, రియాలైజ్ అవుతారని జీవితంలో జరిగిన తప్పులు మళ్ళీ జరుగకుండా జాగ్రత్త పడుతారని ఆశాభావంతో సినిమా నిర్మాణం చేసి ప్రజల ముందుకు పంపుతారు.అంతేగాని సినిమా లాగా జీవితాలు ఉండవని నేటి యువత గమనించగలరని ఇక్కడ మనం ఒక కుటుంబ ప్రస్తావన పరిశీలన చేద్దాం చూడండి.జరిగిన విషయం చాలా స్పష్టంగా సమాజంలో నడుస్తున్న విధానంలో చట్టం చెప్పిన్నట్టు హక్కులు పొందుటకోసం కని పెంచి సకల సౌకర్యాలు కల్పించి సమాజంలోగుర్తింపు స్థాయి కలిగిన వెంటనే పశు ,పక్షలుగా... ప్రవర్తించి కన్న వారిని కాదని, బాల్య దశలో పెంచిన, పెరిగిన విధానం మర్చిపోయిన విధానం మనం ఇక్కడ పరిశీలన చేయవచ్చు. చూడండి అందరం ఆలకిద్దాంఒకసారి 45 ఏళ్ల వయసున్న ఒకామె కోర్టు మెట్లు ఎక్కింది.జడ్జిగారి ముందు ఆమె ఇలా విన్నవించుకుందొ "మా వారికి ఆరోగ్యం బాగాలేదు. మాకు ఒక పాప ఉంది. నేను అందరి ఇళ్లలో పనిచేసి తెచ్చిన డబ్బుతో కుటుంబాన్ని పోషిస్తున్నాను. అందరినీ అడుక్కుని ఎలాగోలా నా కూతురికి మంచి చదువు చెప్పించాను.మా అమ్మాయిని ఎటువంటి కష్టం తెలియకుండా పెంచాను. అమ్మాయి కూడా బాగా చదివి ఉద్యోగం సంపాదించుకుంది. ఇక మా కష్టాలు తీరాయి అనుకునే లోపు అమ్మాయి కనిపించకుండా పోయింది. ఎవరైనా మాయమాటలు చెప్పి మోసంచేసి ఎత్తుకుపోయారేమోఁ.... అని చెప్పింది.జడ్జిగారు ఆ విషయం



గురించి పూర్తిగా విచారించగా, ఆ రోజు వాళ్ళ అమ్మాయి కోర్టుకు వచ్చింది.బోనులో ఎదురెదురుగా తల్లి కూతుర్లు. ఆ అమ్మాయి కళ్ళలో ఏమాత్రం ప్రేమ కనిపించలేదు. తప్పు చేశానన్న పశ్చాత్తాపమూ లేదు.ఆ అమ్మాయి... "నన్ను ఎవరూ మోసం చేయలేదు. నన్ను ఎవరూ ఎత్తుకుని పోలేదు. నేను మేజర్ ని. నాకు నచ్చిన వ్యక్తిని పెళ్లి చేసుకున్నాను." అని చెప్పింది.ఇంట్లో వాళ్లకు ఒక్కమాటైనా చెప్పాలి కదా!.... అని అడగాలని అనుకున్నా, కోర్టులో ఇలాంటి సంభాషణలు ఉండరాదు. కనుక ఒక గంటసేపు తల్లి కూతుర్లు మాట్లాడుకోవలసిందిగా జడ్జిగారు తీర్పు ఇచ్చారు.జడ్జిగారి ఆశ ఏంటంటే... ఒకవేళ ఆ తల్లీకూతుళ్ళు కలిసి మాట్లాడుకుంటే, ఆ తల్లి కష్టాన్ని కూతురు అర్థం చేసుకుంటుందని, గతాన్ని తలచి ఆమె మారుతుందేమో అని.ఆయనకూ మనసు ఉంది కదా! అందుకే ఆలోచించి అలా చెప్పారు.ఒక గంట తరువాత మళ్ళీ వచ్చిన తల్లి కూతుర్లు ఎదురుగా నిలబడ్డారు. కానీ, ఎటువంటి మేజిక్కూ జరగలేదు.అమ్మ ఒక నిశ్చయానికి వచ్చి, "ఇక అమ్మాయి ఇష్టం అండీ... తను సంతోషంగా ఉంటే మాకు అంతే చాలు. ఒక్కమాట... వాళ్ళ నాన్నతో వెళ్ళొస్తానని చెప్పమనండి. ఆయనకు ఆ పిల్లంటే ప్రాణం" అని తల్లి చెప్పింది."వాళ్ళ నాన్న ఎక్కడ?" అని అడగగా... అతను ఒక మూలన కూర్చుని ఇవన్నీ గమనించి కన్నీరు పెట్టుకుంటున్నాడు. అతను వికలాంగుడు అతనిని ఒకరు ఆసరాగా పట్టుకుని ఉన్నారు.అయినా ఏమాత్రం మనసు కరగని ఆ అమ్మాయి "ఇక నేను వెళ్లొచ్చా"... అని అడిగి బయట తన భర్త వేచిచూస్తున్న కార్ ఎక్కి వెళ్లిపోయింది.ఆ అమ్మాయిని శిక్షంచడానికి కోర్టుకి అధికారం లేదు. ఃఆర్డర్ వేసి ఇవి ఆచరించి తీరాలిః అని చెప్పడానికి ఇంకా చట్టాలు రాలేదు.జడ్జిగారు ఆ అమ్మను ఉద్దేశించి... "ఇప్పుడెలా వెళతారు?" అని అడిగితే... "బస్టాండ్ లో నలుగురి దగ్గర అడుక్కుని మా ఊరువెళ్ళిపోతాం. అక్కడ మళ్ళీ ఇళ్లలో పనిచేసుకుని మా బతుకులు ఈడ్చేస్తాం." అని అంటుంటే అక్కడ అందరి కళ్ళలో కన్నీళ్లు.కోర్టు నుండి బయటకు వచ్చిన జడ్జిగారు ఆమెకు వెయ్యి రూపాయలు ఇవ్వగా, అక్కడ ఉన్నవారంతా తోచిన సాయం చేసి పంపారు.సినిమాల్లో లాగా నిజ జీవితాల్లో మార్పులు ఉండవు.తప్పు చేశామేమో అనే పశ్చాతాపం ఉండదు. చట్టం కూడా కొన్నిసార్లు మౌనంగా చూస్తూ ఉండాలి అంతే మన పిల్లలకు మన కష్టం తెలియకుండా పెంచాలి అని అనుకోవడమే పొరపాటు.ప్రేమను పంచినట్టే కష్టాన్ని కూడా పంచండి. అప్పుడైనా కాస్తంత మానవత్వంతో మనుషులుగా మిగిలిఉంటారు. లేకపోతే మానవత్వాన్ని మరిచిపోయి, ప్రేమగా పెంచిన తల్లిదండ్రుల్ని నిర్దాక్షణ్యంగా గాలికొదిలేసి తమదారిన తాము

# ఇవి తెలుసుకుంటే



జీవితంలో స్ఫస్ అనేది ఎవ్వరికీ అంత ఈజీగా రాదు. అనుకున్నది సాధించాలంటే ఎంతో కష్టపడాలి. అలాంటి విజయాన్ని సాధించడానికి ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సిన విషయా లేంటి? మనల్ని మనం ఎలా తీర్చిదిద్దుకుంటే విజయం వరిస్తుందో అన్న విషయంపై నిపుణులు ఏం చెబుతున్నారో చూద్దాంౌసంతోషంసంతోషం, ఆనందం అనేవి కేవలం ఫీలింగ్స్ మాత్రమే కావు.. అదొక లైఫ్ స్టైల్ లాంటిది. మనం చేసే పనిలో మనకు సంతృప్తి లేనట్టయితే, అందులో విజయాన్ని పొందడం కష్టం. అందుకే చేసే పనిని ఇష్టంగా చేయడం అలవాటు చేసుకోవాలి. అందులోనే సగం విజయం సొంతమైనట్టే.నమ్మకంమనం చేసే పనిపై పూర్తి నమ్మకం ఉండాలి. ఏదైనా సాధించగలం అని బలమైన నమ్మకం ఉంటే అసాధ్యం కూడా సుసాధ్యమవుతుంది.లక్ష్యంలక్ష్యం లేని జీవితం వ్యర్థం. జీవితంలో పైకి ఎదగాలంటే ముందుగా ఓ లక్ష్యన్ని నిర్దేశించుకోవాలి. ఆ లక్ష్య సాధనకి కృషి చేయాలి.పట్టుదలచేసే పని ఏదైనా పట్టుదల ప్రదర్శించాలి. మనం చేయడానికి ఇప్పుడు ఇదొక్క పనే వుందన్నట్టుగా పట్టుదలతో పనిచేయాలి. మనకున్న పట్టుదలే విజయాన్ని సాధించిపెడుతుంది.స్ఫూర్తినచ్చిన విషయాల నుంచి, వ్యక్తుల నుంచి స్ఫూర్తి పొందాలి. ఆ ప్రేరణే మనల్ని ముందుకు నడిపిస్తుంది. విజయం వరకు వెంట తీసుకు ౣంది.విశ్వాసంమీరు తలుచుకుంటే చేయలేనిది అంటూ ఏదీ లేదు. ధృఢమైన విశ్వాసం ఒక్కటే మనల్ని విజయవంతమైన మనిషిగా తీర్చిదిద్దుతుంది. మనలో వున్న శక్తిని మనమే నమ్మకపోతే ఇంవరు నమ్ముతారు. అది గ్రహించినప్పుడే విజయం దరి చేరుతుంది.విలువలువిలువలు పాటించే విషయంలో ఎప్పుడూ రాజీపడొద్దు. ఎందుకంటే విలువలు లేకుండా అడ్డదారిలోనూ విజయం సాధించొచ్చేమో కానీ ఆ విజయాలకి విలువ వుండదని గ్రహించాలి. విలువలు లేని విజయం మీకు సరైన వ్యక్తిత్వం లేకుండా చేస్తుందనే సత్యాన్ని తెలుసుకోవాలి.జీవితం పట్ల అవగాహనజీవితం ఎలా వుండాలి అనే విషయంలో ఒక సరైన అవగాహన వుండాలి. జీవితం అలా వుండటం కోసం కృషిచేయాలి. అప్పుడే మీ కలలు నిజం అవుతాయి.సవాళ్లు ఎదుర్కునేందుకు సిద్ధంగాజీవితంలో ఎప్పుడైనా, ఏ సవాళ్లయినా ఎదురు కావచ్చు. ఆ సవాళ్లను ఎదుర్కోవడానికి వెనుకాడకుండా సిద్ధంగా వుండాలి.

## ఆకులపై అద్భుత చిత్రాలు

నైపుణ్యం అనేది ఒకరి సొత్తు కాదు. నేర్చుకోవాలనే తపన ఉండాలే కానీ దాన్ని ఎవరైనా సొంతం చేసుకోవచ్చు. అలాగే పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమే అని నిరూపిస్తోంది కల్లెం ధనుజ. తన ఆలోచనలను ప్రకృతిలో దొరికే ఆకులపై ప్రతిబింబిస్తుంది. అద్భుతమైన నైపుణ్యంతో అందమైన చిత్రాలతో అందరి ప్రశంసలు అందుకుంటోంది. లీఫ్ ఆర్ట్‌తో పాటు పెయింటింగ్, ఎస్సే రైటింగ్, గానం వంటి పలు రంగాల్లో రాణిస్తూ నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తోంది. ఇలా ప్రకృతినే కాన్వాస్‌గా మార్చిన యాదాద్రి యువతి పరిచయం నేటి మానవియాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన కల్లెం సాయిలు, పార్వతమ్మ దంపతుల బిడ్డ కల్లెం ధనుజ. నిరుపేద కుటుంబంలో పుట్టినా, ప్రతిభకు పేదరికం అడ్డుకాదని తనలోని నైపుణ్యంతో నిరూపించింది. చిన్ననాటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న ఆమె చదువుతో పాటు కళలపై ప్రత్యేక ఆసక్తి పెంచుకుంది.కరోనా కాలమే కళకు కొత్త దారిప్రస్తుతం నల్లగొండ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా పనిచేస్తున్న ధనుజ, ఉపాధ్యాయ వృత్తితో పాటు తనలోని కళాకారిణిని మరింత మెరుగు పరుచుకుంటోంది. 'ఏదైనా కొత్తగా కనిపిస్తే దాన్ని కళారూపంలో తీర్చిదిద్దాలనే తపన చిన్నప్పటి నుంచే ఉంది' అని ఆమె చెబుతుంది. కరోనా లాక్‌డౌన్ సమయంలో ఆన్‌లైన్‌లో లీఫ్ ఆర్ట్ కళాకారుడు గుండు శివకుమార్ నైపుణ్యాలను చూసి ఆశ్చర్యపోయిన ధనుజ తను కూడా ఆ కళను నేర్చుకోవాలనుకుంది. అనుకున్న వెంటనే దాన్ని ఆచరణలో పెట్టింది. పట్టుదలతో లీఫ్ ఆర్ట్ నేర్చుకుంది.చెట్టు ఆకులతొలుత కాలుగచెట్ల ఆకులపై చిన్న చిన్న డిజైన్లు, పేర్లు రాయడం ప్రారంభించింది. ఆ తర్వాత రావిచెట్టు ఆకులపై స్వాతంత్ర్య సమరయోధులు, దేవుళ్లు, రాజకీయ నాయకులు, ప్రముఖుల ముఖచిత్రాలను అద్భుతంగా చెక్కడం నేర్చుకుంది. అలాగే బర్త్‌డేలు, మ్యారేజ్‌డేలు, ప్రత్యేక సందర్భాలకు అనుగుణంగా ఆకులపై చిత్రాలు వేసి సంబంధిత వ్యక్తులకు బహుమతిగా పంపిస్తోంది. ఇప్పటివరకు వందకు పైగా లీఫ్ ఆర్ట్ చిత్రాలు రూపొందించి ప్రత్యేక గుర్తింపు సంపాదించింది.కుటుంబమే నా బలంతన విజయానికి కుటుంబ ప్రోత్సాహమే ప్రధాన కారణమని ధనుజ గర్వంగా చెబుతుంది. ముఖ్యంగా తన అక్క ధర్మమణి తన బ్యాక్‌బోన్ అంటుంది. 'విత్‌ఔట్ హర్ ఐ ఆం నథింగ్. చిన్నప్పటి నుంచి ప్రతి రంగంలో ముందుండాలని మా అక్క నన్ను నిత్యం ప్రోత్సహించింది. అవసరమైన సామగ్రి అందిస్తూ, నా ఆలోచనలకు బలం ఇచ్చింది' అంటూ ఆమె తన సంతోషాన్ని వ్యక్తం చేసింది.విద్యలోనూ శిఖరంకళల్లోనే కాదు విద్యారంగంలోనూ ధనుజ అసాధారణ ప్రతిభ కనబరిచింది. కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి పీజీ (తెలుగు) పూర్తి చేసి, యూనివర్సిటీ స్థాయిలో ప్రథమ స్థానం సాధించి స్వర్ణ పతకం అందుకుంది. వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో జరిగిన 23వ స్నాతకోత్సవంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా ఈ గోల్డ్ మెడల్‌ను స్వీకరించింది. 2021లో ఈ ఘనత సాధించగా, ఆమె విజయం జిల్లాకే గర్వకారణంగా నిలిచింది.మహిళలకు సందేశం'పట్టుదల ఉంటే ఆడపిల్లలు ఏ రంగంలోనైనా ఉన్నతస్థాయికి చేరుకోవచ్చు. అవకాశం కోసం ఎదురు చూడకుండా, మనలోని ప్రతిభను మనమే వెలికితీయాలి' అని ధనుజ యువతకి పిలుపునిస్తోంది. లీఫ్ ఆర్ట్‌తో పాటు మరిన్ని కళారంగాల్లో తన ప్రయాణాన్ని మరింత విస్తరించాలని, ప్రభుత్వ ప్రోత్సాహం లభిస్తే ఈ కళను అంతర్జాతీయ స్థాయికి తీస్తుళ్లాలని ఆమె ఆకాంక్ష. గ్రామస్తులు కూడా ధనుజలాంటి ప్రతిభావంతులను గుర్తించి ప్రభుత్వాలు చేయూతనివ్వాలని కోరుతున్నారు. ప్రకృతిని ప్రేమిస్తూ, కళను సాధనగా చేసుకుని, విద్యను ఆయుధంగా మలుచుకున్న కల్లెం ధనుజ నేటి యువతికి నిజమైన ఆదర్శం.

## వాస్తవాలను తెలుసుకోండి

## నిజమా కదా ఆలోచన చేయండి.

మనిషి ఇరుక్కున్నాడు మెగా గ్లోబలైజేషన్ లోద్రమ్ముల మోతను సంగీతమంటున్నారు. !పీలికబట్టల్ని వస్త్ర ధారణ అంటున్నారు.!భౌతిక అకర్షణను ప్రేమని పిలుస్తున్నారు.! సహజీవనాన్ని సంసారమంటున్నారు.!గ్రాఫిక్ గిమ్మిక్కులను సినిమా అంటున్నారు.!డూప్ ల పోరాటాన్ని హీరోయిజం అంటున్నారు.!పదవుల పోరాటాన్ని ప్రజాస్వామ్యమంటున్నారు.అధికార ఆరాటాన్ని రాజకీయమంటున్నారు.!ఆస్తుల పంపకాన్ని కుటుంబం అంటున్నారు.!దారితప్పిన సరదాలను సంస్కృతి అంటున్నారు.! భుక్తి మార్గాన్ని చదువు అంటున్నారు.!కోరిన కోర్కెలు తీరిస్తేనే... దేవుడంటున్నారు.!ఆస్తి ఉంటేనే... గొప్పవాడు అంటున్నారు.!మందు పోయిస్తేనే...మిత్రుడు అంటున్నారు.! కట్నం తెస్తే...భార్య అంటున్నారు.!సొమ్ములు తెస్తేనే... సంసారం అంటున్నారు.! కాసులు తెస్తేనే... కాపురం అంటున్నారు.!నిజాయితీగా ఉంటే... అసమర్థుడంటున్నారు.!సక్రమంగా ఉంటే... అమాయకుడంటున్నారు.!అసత్యాలు మాట్లాడితే... బ్రతక నేర్చిన వాడంటున్నారు.!నిజం పలికితే... నీ ౣందుకు పోవోయ్ అంటున్నారు..!న్యాయబద్ధంగా ఉంటే... ఎలా బ్రతుకుతాడో అంటున్నారు.!అన్యాయంగా బ్రతికినా... స్ఫస్...ఎంచక్కా ఉన్నాడంటున్నారు.!అన్యాయాన్ని ఎదిరిస్తే... అతనిందుకు అంటున్నారు.!నిజాయితీగా బ్రతికితే... కూడుపెడుతుందా అంటున్నారు.!మాయకమ్మిన జీవితాన్ని శాశ్వతమనుకుంటున్నారు.!మరణమనే మహా సత్యాన్ని విస్మరిస్తున్నారు.!పరిస్థితులకు అనుగుణంగా పాత అర్థం చెరిగిపోయి, ప్రయోజనాలకు అందగా... సరికొత్త పరమార్థం ఆవిర్భవిస్తోంది.!స్వార్థ కాంక్షణుగుణంగా... విపరీతార్థం ఆవిష్కృతమవుతోంది.!ఇదే గ్లోబలైజేషన్ మహిమ అంటేటెక్నాలజీ పెరిగింది...సౌకర్యం పెరిగింది...విలాసం పెరిగింది...విజ్ఞానం పెరిగింది...కాలుష్యం పెరుగింది...ఖర్చు పెరిగింది...కల్తీ పెరిగింది...రసాయన బంధం పెరిగింది...అన్నీ పెరిగాయి...కానీ! పెరుగుట విరుగుట కొరకే అన్నట్లుమన ఆయుష్ ప్రమాణం మాత్రం 50% పైగా తగ్గింది..రోగం తెలియని చికిత్సలౌశవాలకు రక్తపరీక్షలు...విద్య పెద్ద వ్యాపారం...వ్యాధి ఇంకా పెద్ద వ్యాపారం దహించనున్న గ్లోబల్ వార్నింగ్.... భావితరాలకు వార్నింగ్ఔఅయినా బాధ్యత లేనట్లు..

## పుల్లెల గోపీచంద్ కుమార్తె గాయత్రికి అర్జున అవార్డు.. క్రీడా పురస్కారాల పూర్తి జాబితా...

- 2025 సంవత్సరానికి గాను జాతీయ క్రీడా పురస్కారాలు
- మొత్తం 17 మంది క్రీడాకారులను వరించిన అర్జున పురస్కారం
- ఈ ఏడాది ఎవరికీ మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డు ప్రకటించని కేంద్రం
- చెస్ సంచలనం దివ్య దేశ్‌ముఖ్, అథ్లెట్ తేజస్విన్ శంకర్‌కు కూడా అర్జున
- పలువురు కోచ్‌లకు ద్రోణాచార్య, క్రీడా ప్రముఖులకు జీవన సాఫల్య పురస్కారాలు




**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర ప్రభుత్వం 2025 సంవత్సరానికి గాను జాతీయ క్రీడా పురస్కారాలను మంగళవారం ప్రకటించింది. భారత బ్యాడ్మింటన్ దిగ్గజం, కోచ్ పుల్లెల గోపీచంద్ కుమార్తె గాయత్రిని ప్రతిష్ఠాత్మక అర్జున అవార్డు వరించింది. మహిళల డబుల్స్‌లో తన భాగస్వామి ట్రీసా జాలీతో కలిసి పుల్లెల గాయత్రి ఈ పురస్కారానికి ఎంపికైంది. వీరితో పాటు డెకాథ్లాన్ అథ్లెట్ తేజస్విన్ శంకర్, చెస్ ప్రపంచకప్ విజేత దివ్య దేశ్‌ముఖ్ సహా మొత్తం 17 మంది క్రీడాకారులకు అర్జున అవార్డులను ప్రకటించారు. అయితే, ఈ ఏడాది దేశ అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డును ఎవరికీ ప్రకటించకపోవడం గమనార్హం.సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ (రిటైర్డ్) అరుణ్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ సిఫార్సుల మేరకు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ఈ అవార్డుల జాబితాను విడుదల చేసింది. గత నాలుగేళ్లుగా నిలకడగా రాణిస్తూ, క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించిన వారికి అర్జున అవార్డును ప్రదానం చేస్తారు. కామన్వెల్త్ క్రీడల్లో డెకాథ్లాన్‌లో పతకం గెలిచిన తొలి భారతీయ అథ్లెట్‌గా తేజస్విన్ శంకర్ చరిత్ర సృష్టించగా, ఫిడే మహిళల ప్రపంచ కప్ గెలుచుకుని దివ్య దేశ్‌ముఖ్ సంచలనం రేపారు. హాకీ క్రీడాకారుడు హార్దిక్ సింగ్ పేరు ఖేల్ రత్న కోసం పరిశీలనకు వచ్చినప్పటికీ, అతను పోటీ నుంచి తప్పుకోవడంతో ఈసారి ఎవరికీ ఈ పురస్కారం దక్కలేదని తెలిసింది.

సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు అరుమై నాయగంను అర్జున అవార్డు (జీవన సాఫల్యం) వరించింది. 1962 జకార్తా ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన భారత జట్టులో ఆయన సభ్యుడు. కోచ్‌లకు ఇచ్చే ద్రోణాచార్య అవార్డులు ముగ్గురిని వరించాయి.

**అవార్డు గ్రహీతల పూర్తి జాబితా:**

అర్జున అవార్డు గ్రహీతలు (17 మంది)
తేజస్విన్ శంకర్, మహమ్మద్ అజ్మల్, ప్రియాంక గోస్వామి (అథ్లెటిక్స్)
ట్రీసా జాలీ, పుల్లెల గాయత్రి (బ్యాడ్మింటన్)
నరేందర్ బెర్వాల్ (బాక్సింగ్)
విదిత్ సంతోష్ గుజరాతీ, దివ్య దేశ్‌ముఖ్ (చెస్)
లాల్రెమ్సియామి, రాజ్‌కుమార్ పాల్ (హాకీ)
సుర్జీత్, పూజ (కబడ్డీ)
ధనుష్ శ్రీకాంత్, రుద్రాంశ్ ఖండేల్వాల్ (పారా షూటింగ్)
ఏక్తా భయాన్ (పారా అథ్లెటిక్స్)
అరవింద్ సింగ్ (రోయింగ్)
అఖిల్ షెయోరాన్ (షూటింగ్)
అర్జున అవార్డు (జీవన సాఫల్యం)
అరుమై నాయగం (ఫుట్‌బాల్)
ద్రోణాచార్య అవార్డు (కోచ్‌లు)
ఛోటే లాల్ యాదవ్ (బాక్సింగ్)
పర్వీర్ సింగ్ (అథ్లెటిక్స్)
నేహా నందకుమార్ చవాన్ (షూటింగ్)
జీవితకాల సాఫల్య పురస్కారం (ధ్యాన్‌చంద్ అవార్డు)
ధర్మేంద్ర సింగ్ యాదవ్ (బాక్సింగ్)
వీరేందర్ కుమార్ (రెజ్లింగ్)
రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కార్
ఆర్మీ పారాలింపిక్ నోడ్, పుణే

# 84కే 4 వికెట్లు.. మరో 288 రన్స్ చేస్తేనే లంక గెలిచేది.. లేకపోతే విజయం భారత్‌దే







**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్ వర్సెస్ శ్రీలంకల మధ్య జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్ నాలుగో రోజు ముగిసే సమయానికి టీమిండియా పూర్తి పైచేయి సాధించింది. ఆతిథ్య లంక జట్టు ముందు 372 పరుగుల భారీ లక్ష్యాన్ని పెట్టింది. ఇక ఇన్నింగ్స్ లో లభించిన 178 పరుగుల ఆధిక్యంతో నాలుగో రోజు బరిలోకి దిగిన భారత్, చివరకు శ్రీలంకను తీవ్ర ఒత్తిడిలోకి నెట్టింది. లంక గెలవాలంటే ఇంకా 288 పరుగులు చేయాల్సి ఉండగా, టీమిండియాకు చారిత్రాత్మక విజయం సాధించడానికి కేవలం 6 వికెట్లు తీస్తే సరిపోతుంది. భారత జట్టు రెండో ఇన్నింగ్స్ ప్రదర్శన ఆశించిన స్థాయిలో కొనసాగలేదు. క్రమశిక్షణతో కూడిన లంక బౌలింగ్‌కు వరుసగా ఇండియన్ బ్యాటర్లు వికెట్లు పారేసుకోవడంతో జట్టు 193 పరుగులకే ఆలౌట్ అయింది. అయినప్పటికీ, తొలి ఇన్నింగ్స్‌లో సాధించిన 178 పరుగుల భారీ లీడ్ పుణ్యమా అని శ్రీలంక ముందు 372 పరుగుల టార్గెట్ ని ఉంచగలిగింది. గాలే పిచ్‌పై చివరి రోజు ఈ కొండంత స్కోరును ఛేజ్ చేయడం లంకకు కష్టమే అని చెప్పాలి.


**84/4 వద్ద నిలిచిన నాలుగో రోజు ఆట:**

లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన శ్రీలంకకు ఆఖరి సెషన్‌లో భారత బౌలర్లు బ్రేకులు వేశారు. పక్కా ప్లానింగ్‌తో దాడి చేసిన టీమిండియా బౌలర్లు, లంక టాప్ ఆర్డర్‌ను దెబ్బతీస్తూ 4 కీలక వికెట్లను నేలకూల్చారు. వెలుతురు లేమి

కారణంగా 34 ఓవర్లు ముగిశాక నాలుగో రోజు ఆటను నిలిపివేసే సమయానికి శ్రీలంక 84 పరుగులకు 4 వికెట్లు కోల్పోయి తీవ్ర కష్టాల్లో కూరుకుపోయింది. ప్రస్తుతం క్రీజులో సోనల్ దినూష (25 రన్స్), ధనంజయ డి సిల్వా (31) నాటౌట్ గా కొనసాగుతున్నారు. కాగా మ్యాచ్ రేపటికి వాయిదా పడినప్పటికీ, విజయం మాత్రం దాదాపు భారత్ సొంతమైనట్లే కనిపిస్తోంది.

# గిల్‌క్రిస్ట్ వరల్డ్ రికార్డ్ బ్రేక్ చేసిన పంత్.. టెస్టుల్లో 100 సిక్సర్లు పూర్తి!




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత వికెట్‌కీపర్-బ్యాటర్ రిషభ్ పంత్ టెస్ట్ క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఈ సుదీర్ఘ ఫార్మాట్‌లో 100 సిక్సర్లు పూర్తి చేసుకున్న తొలి భారతీయ బ్యాటర్‌గా అరుదైన మైలురాయిని అందుకని రికార్డు పుస్తకాల్లో తన పేరును లిఖించుకున్నాడు. భారత్ ఆడుతున్న తాజా టెస్ట్ మ్యాచ్‌లో తన ట్రేడ్‌మార్క్ అటాకింగ్ షాట్‌తో ఈ ఘనత సాధించాడు. అంతర్జాతీయ టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే 100 లేదా అంతకంటే ఎక్కువ సిక్సర్లు బాదిన నాలుగో బ్యాటర్‌గా పంత్ నిలిచాడు.

రిషభ్ పంత్ అటాకింగ్ శైలి ఎంత ప్రమాదకరమైనదో అతని గణాంకాలే చెబుతున్నాయి. టెస్టుల్లో ప్రతి 49 బంతులకు ఒక సిక్సర్ చొప్పున బాది పంత్ సంచలనం సృష్టించాడు. ఈ విషయంలో దిగ్గజ కీపర్ ఆడమ్ గిల్‌క్రిస్ట్ (ప్రతి 67 బంతులకు ఒక సిక్సర్) రికార్డును కూడా పంత్ సునాయాసంగా బ్రేక్ చేసేశాడు.

**ఒత్తిడిలోనూ పంత్ సూపర్ హాఫ్ సెంచరీ:**

తరచుగా విమర్శలు ఎదుర్కొనే పంత్, కష్టసమయంలో జట్టుకు కొండంత అండగా నిలిచాడు. మొదటి సెషన్‌లో భారత్ వరుసగా వికెట్లు కోల్పోయి కుప్పకూలే ప్రమాదంలో పడిన వేళ, పంత్ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో ఆదుకున్నాడు. ఈ క్రమంలోనే పంత్ తన టెస్ట్ కెరీర్‌లో 20వ అర్ధసెంచరీని పూర్తి చేసుకున్నాడు. జట్టుకు టాప్ స్కోరర్‌గా నిలిచి, భారత జట్టు ఆధిక్యాన్ని 350 పరుగుల దాకా తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించాడు.

టెస్ట్ క్రికెట్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన విధ్వంసకర బ్యాటర్ల ఎలైట్ క్లబ్‌లో పంత్ చేరాడు. ఈ జాబితాలో టాప్-4లో ఉన్న ఆటగాళ్ళు:

బెన్ స్టోక్స్ - 138 సిక్సర్లు
బ్రెండన్ మెక్‌కలమ్ -107 సిక్సర్లు
రిషభ్ పంత్ - 100వ సిక్సర్లు
ఆడమ్ గిల్‌క్రిస్ట్ - 100 సిక్సర్లు

# 2026లో రౌడీ దర్శనం లేనట్లేనా?







విజయ్ దేవరకొండ కమ్ బ్యాక్ మూవీ కోసం తన అభిమానులు చాలా ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. గీత గోవిందం విజయ్ చివరి క్లీన్ హిట్. ఆ తర్వాత తన సినిమాలన్నీ నిరాశపరిచాయి. గత ఏడాది వచ్చిన 'కింగ్డమ్'తో బలంగా పుంజుకుంటాడనే అంచనాలు కలిగాయి కానీ.. అది నిజం కాలేదు. ఆ సినిమా ఓ మాదిరిగా ఆడి వెళ్లిపోయింది.ఐతే విజయ్‌కి ఉన్న అదృష్టం ఏంటంటే.. ఎన్ని ఫ్లాపులు ఇచ్చినా తన ఫాలోయింగ్, మార్కెట్ అలాగే కొనసాగుతున్నాయి. క్రేజీ ప్రాజెక్టులు తన చెంతకు వస్తున్నాయి. గత ఏడాది అతను ఒకేసారి రెండు భారీ చిత్రాలను మొదలుపెట్టిన సంగతి తెలిసిందే. అందులో ఒకటి రణబాలి కాగా.. ఇంకోటి రౌడీ జనార్ధన. వీటిలో మొదటిది సెప్టెంబరులో, రెండోది డిసెంబర్లో రిలీజ్ కావాల్సింది. రెంటికీ రిలీజ్ డేట్లు కూడా ఇచ్చారు. కానీ ఈ రెండూ అనుకున్నట్లుగా విడుదల కావట్లేదు.'రణబాలి' వాయిదా అని ఇంతకుముందే క్లారిటీ వచ్చేసింది. ఇప్పుడు 'రౌడీ జనార్ధన' సైతం డిసెంబరులో రిలీజ్ కాదని తెలుస్తోంది. 'రణబాలి' ముందే ఆలస్యం కాగా.. హీరోయిన్ రష్మిక మందన్నా గాయంతో మరింత లేట్ అవుతోంది. ఈ సినిమా షూట్ ఇంకా 30 శాతం దాకా మిగిలి ఉన్నట్లు సమాచారం. మరోవైపు 'రౌడీ జనార్ధన' వర్క్ 50 శాతం దాకా బ్యాలెన్స్ ఉందట. ఈ రెంటిలో ఏదీ ఈ ఏడాదిలో పూర్తయి ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు లేదు. కాబట్టి రౌడీ దర్శనం కోసం 2027 వరకు ఎదురు చూడాల్సిందే. ఐతే వచ్చే ఏడాది ఈ రెంటితో పాటు మరో చిత్రంతోనూ విజయ్ ప్రేక్షకులను పలకరించే అవకాశముంది. రణబాలి, రౌడీ జనార్ధన వచ్చే ఏడాది ప్రథమార్ధంలోనే రిలీజ్ అవుతాయి. 'హాయ్ నాన్న' ఫేమ్ శౌర్యువ్‌తో అనౌన్స్ చేసిన సినిమాను సెకండాఫ్‌లో ప్రేక్షకుల ముందుకు తెచ్చే అవకాశముంది. కాబట్టి ఈ ఏడాది సినిమా లేకపోయినా.. వచ్చే ఏడాది విజయ్ అభిమానులను మూడు చిత్రాలతో మురిపించే ఛాన్సుంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965